శ్రీ వేంకటేశ్వర ప్రాచ్యపరిశోధనాలయము

# శ్రీ అన్నమాచార్యోత్సవక్రమము

## పంచమవర్షము

1953 సం॥ర ఏప్రిల్ 11, 12, 13, తేదీలు


శ్రీ చెలికాని అన్నారావు, బి.ఏ.,

ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్, తిరుమల తిరుపతి దేవస్థానములు

శ్రీ పరవస్తు వేంకటరామానుజస్వామి, ఎమ్. ఏ.

డైరెక్టరు, శ్రీ వేంకటేశ్వర ప్రాచ్యపరిశోధనాలయము, తిరుపతి



తిరుమల తిరుపతి దేవస్థానం ముద్రణాలయములో ముద్రితము

తిరుపతి

1953

## శ్రీ వేంకటేశ్వర ప్రాచ్యపరిశోధనాలయము, తిరుపతి.

# శ్రీ తాళ్ళపాక అన్నమాచార్యోత్సవము,

## పంచమవర్షము

క్రీస్తుశకము పదునైదవ శతాబ్దపు పూర్వార్ధము. అది శ్రీనాథపోతన కవీశ్వరుల వార్ధకసమయము. అప్పుడే కడపసీమ యందలి తాళ్లపాక గ్రామమునఁ బదకవితాపితామహుఁడగు అన్నమాచార్యుఁడు క్రోధివత్సర వైశాఖ విశాఖనక్షత్రమున అవతరించి (క్రీ. శ. 1424.) శేషాద్రినివాసుఁడగు శ్రీనివాసుని యనుగ్రహమునఁ బదునాఱవ యేటినుండియు నా స్వామిపై కీర్తనల రచించుట నారంభించెను. దినమున కొక్కటికిఁ దక్కువ కాకుండ కీర్తనల రచించుచు డెబ్బది తొమ్మిదేండ్లు జీవించి దుందుభివత్సర ఫాల్గున ద్వాదశినాఁడు పరమపదమునొందెను. (క్రీ. శ. 1503.) అట్టి ధన్యజీవి తాళ్ళపాక అన్నమాచార్యుల దివ్యస్మృతికై శ్రీ తిరుమల తిరుపతి దేవస్థానము కమిటీవారు ప్రతివత్సరము నీ యుత్సవము జరుపునట్లు తీర్మానించిరి.

11-4-1953. తేదీన శ్రీ తాళ్ళపాక అన్నమాచార్య పంచమ వార్షికోత్సవము ప్రారంభింపఁబడినది. ఉదయం 7-30

గంటలకు యథాపూర్వముగ శ్రీ అన్నమాచార్య పెదతిరుమ లాచార్యుల విగ్రహములను శ్రీ వేంకటేశ్వరస్వామి పటముతోఁ గూడ మేళతాళములతో వేంచేపు చేయించి శ్రీ దేవస్థానము ఎగ్జిక్యూటివు ఆఫీసరువారి ఆఫీసునుండి బజారువీధి రామస్వామి దేవాలయోత్తర మాడవీధుల మీఁదుగా నూరేఁగించి ఉత్సవ మండపమునఁ బ్రతిష్ఠించిరి. దేవస్థానాధికారులు పండితులు గాయకులు పురప్రముఖులు మొదలగు పలువురు ఉత్సవమునఁ బాల్గొని సభామండపము నలంకరించిరి. 8-30 గంటలకు సభా రంభమయ్యెను. దివ్యకాంతులతో సభ ప్రకాశించుచుండెను. శ్రీమతి సి. ఇందిరగారు ఏ దేవుని......, ఇత్యాది కృతిని మనో హరముగ గానముచేసి ప్రార్థనగావించిరి.

9-గంటలకు శ్రీ వేంకటేశ్వర ప్రాచ్యపరిశోధనాలయ సంగీతాచార్యులగు శ్రీ రాళ్లపల్లి అనంతకృష్ణశర్మగారు శ్రీ బెజ వాడ గోపాలరెడ్డిగారిని నాఁటిసభ కధ్యక్షతను వహింప వరించిరి. శ్రీ రెడ్డిగారధ్యక్షస్థానము నలంకరించిన వెంటనే శ్రీ వేంకటేశ్వర ప్రాచ్యపరిశోధనాలయ కులపతులు శ్రీ పరవస్తు వేంకటరామా నుజస్వామిగారు స్వాగతోపన్యాసమును జదివి గతవత్సరకార్య క్రమమును గూడ నివేదించిరి. (చూ — అనుబంధము. 1.) పిదప సధ్యక్షులు శ్రీ గోపాలరెడ్డిగారు అన్నమాచార్యుని భక్తియోగా దులను గూర్చి మృదుమధురముగను దీర్ఘముగను నుపన్యసించి సభ్యులఁ దన్మయులఁజేసిరి. (చూ — అనుబంధము. 2.) తరు

వాత పదియవ తేదీ సాయంకాలము జరిగిన అన్నమాచార్య సంకీర్తనల పరీక్షలో గెలుపొందిన యీ దిగువవారికి అధ్యక్షులు బహుమతుల నొసంగి వారిని దీవించిరి.

మొదటి బహుమతి :— శ్రీమతి సి. వి. కౌసల్య &
,, సి. వి. పద్మ. రు. 15-0-0 లు.
రెండవ బహుమతి — ,, కె. లక్ష్మి. రు. 10-0-0 లు.
మూడవ బహుమతి — శ్రీ పి. వి. సుబ్రహ్మణ్యము రు. 5-0-0 లు.

అధ్యక్షుల కోరికపై ప్రథమ ద్వితీయ బహుమానములను బొందినవారు యథాక్రమముగ 'ఇందరికి నభయంబు నిచ్చుచేయి' 'బ్రహ్మకడిగిన పాదము' అను కీర్తనలను పాడి సభ్యుల నానందపరచిరి.

అవల శ్రీమతి రా. ప్రభావతిగారు, శ్రీమతి యన్. వి. వేదవల్లిగారును కలిసి తెప్పగామ్రాకుమీాద, మొదలుగాగల అన్నమాచార్య సంకీర్తనలను గానముచేసి యానందామృతమును గురిపించిరి. శ్రీమతి ప్రభావతిగారి వీణ, మైసూరువిద్వాంసులగు శ్రీ టి. యన్. తాతాచారిగారి ఫిడేలు, శ్రీ వి. వి. రంగనాథన్‌గారి మృదంగమును ఆ గానమునకుఁ గడు వన్నెఁదెచ్చినవి. అనంతరము వరుసగా కృతజ్ఞతా నివేదనము, సభ్యులకు చందన తాంబూలాది సత్కారము, మంగళహారతి, అనునవి జరుగుటతో 11-30 గంటలకు నాఁటి యుదయము సభాకార్యక్రమములు ముగిసినవి.

11_4_53 తేదీ సాయంకాలము 5-30 గంటలకు గాన సభ ప్రారంభింపఁబడెను. గాయకులు _ వారు గానముచేసిన అన్నమాచార్య సంకీర్తనలు _ రాగములు మొదలగు వివరణములు దిగువ పొందుపరచఁబడినవి. ఈ గానముల కన్నిటికిని శ్రీ టి. యన్. తాతాచారి, శ్రీ వి. వి. రంగనాథన్ గారలే ప్రక్క-వాద్యములను వాయించిరి. నాఁటి సభాధ్యక్షులు శ్రీ బెజవాడ గోపాలరెడ్డిగారి కోరికపై ప్రత్యేకముగ శ్రీ రాళ్లపల్లి అనంతకృష్ణశర్మగారు కూడ సంకీర్తనా గానమునఁ బాల్గొనిరి.

వివరణము :___

(1) శ్రీమతి పి. సీతాలక్ష్మిగారు :—

| (సంకీర్తన) | | (రాగము) |
|---|---|---|
| 1. సురులకు నరులకు | ... | నాట. |
| 2. రామ రామ | ... | బిలహరి. |
| 3. శరణు శరణు | ... | కామవర్ధని. |
| 4. చూడుడు | ... | భైరవి. |
| 5. మాదేహికి | ... | ఫరజ్. |
| 6. చూడఁ జూడ | ... | వరాళి. |
| 7. అదివో | ... | శ్రీరాగము. |
| 8. మంగళం గోవిందునకు | ... | లలిత. |

(2) శ్రీ రాళ్లపల్లి అనంతకృష్ణశర్మగారు:—

| (సంకీర్తన) | | (రాగము) |
|---|---|---|
| 1. చక్కని తల్లికి చాంగుభళా | ... | పాడి. |
| 2. పరతత్త్వంబగు బాలుఁడు | ... | దేశాక్షి. |
| 3. ఎందరి వెంట ఎట్లు తిరుగవచ్చు | ... | దేవగాంధారి. |
| 4. బ్రహ్మ కడిగిన పాదము | ... | ముఖారి. |
| 5. సువ్వి సువ్వి సువ్వాని | ... | కేదారగౌళ. |

(3) శ్రీ సి. కృష్ణమూర్తిశాస్త్రిగారు:—

| (సంకీర్తన) | | (రాగము) |
|---|---|---|
| 1. హరియవతారమె | ... | సౌరాష్ట్ర. |
| 2. దేవదేవం భజే | ... | ధన్యాసి. |
| 3. నారాయణ తే నమో నమో | ... | బేహాగ్. |
| 4. సేవింతురా | ... | ముఖారి. |
| 5. హరిరసము | ... | హిందోళ. |
| 6. మంగళం గోవిందునకు | ... | సురట. |

గాయకులందరు సుప్రసిద్ధులు కాన వారిని గూర్చి యధిక ప్రసంగమనావశ్యకము. ఎవరికి వారు సుమా రొకగంట సేపు కీర్తనలను గానముచేసి సభ్యుల నానందవాహిని నోలలాడించిరి. సభ్యులలో శ్రీ బెజవాడ గోపాలరెడ్డిగారు, దేవస్థానము ఎగ్జిక్యూటివు ఆఫీసరు శ్రీ చెలికాని అన్నారావుగారు, మొదలగు ప్రముఖు

లందరు నుండిరి. పిదప రాత్రి 9-30 గంటలకు శ్రీ ప్రయాగ నరసింహశాస్త్రిగారు తాము క్రొత్తగా రచించిన శ్రీనివాస కల్యాణమను హరికథను ప్రారంభించిరి. సహజసిద్ధములగు హాస్యోక్తులతో, మధుర గంభీరమగు కంఠముతో, చతురవచన విన్యాసముతోను, శ్రీ శాస్త్రిగారు సుమారు రెండుగంటలు హరికథా కాలక్షేపమునుజేసి సభ్యులనుజ్జ్వాతలూగించి, అన్న మాచార్యులయు, వారికీర్తనలయు మహిమను వారి మనము లందు స్థిరపరచిరి. రాత్రి 12 గంటలకు శ్రీస్వామికి మంగళ హారతి సమర్పణముతో తొలినాఁటి కార్యక్రమము సంపూర్ణ మయ్యెను.

12_4_1953 తేదీ ఉదయము 7-30 గంటలకు ఉత్స వముయొక్క రెండవనాఁటి కార్యక్రమము ప్రారంభమాయెను. అన్నమాచార్యచరిత పరిశోధకముఖ్యులగు శ్రీ సాధుసుబ్రహ్మణ్య శాస్త్రిగారు శ్రీ రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మగారి వరణముపై నాఁటి సభకాధ్యక్ష్యమును వహించిరి. శ్రీ వేంకటేశ్వర ప్రాచ్య పరిశోధనాలయాంధ్రభాషా సాహిత్యాచార్యులు, శ్రీ కోరాడ రామకృష్ణయ్యగారు మధురముగ నుపన్యసించుచు అన్నమా చార్యుల సంకీర్తన సాహిత్య వైశిష్ట్యమును ప్రధానముగ భాషా తత్త్వదృష్టితో సవిమర్శముగ నుగ్గడించిరి. (చూ — అను బంధము. 3.) శ్రీ బి. గోపాలరెడ్డిగారు, పౌరులు పలువురు సాహిత్యతత్త్వజ్ఞులును సభనలంకరించియుండిరి. పిదప అధ్య

ర్తులు అన్నమాచార్యచరిత పరిశోధనమునఁ దమకుఁ గలిగిన యనుభవములను, సంకీర్తనల గొప్పదనమును, కొన్ని కర్తవ్యములను గూర్చి మనోరంజకముగ నుపన్యసించిరి. (చూ — అనుబంధము. 4.) క్రమముగ కృతజ్ఞతా నివేదనము, మంగళ హారతియు జరిగినతోడనే 11-గంటలకు నాఁటి ఉదయము కార్యక్రమము ముగిసెను.

సాయంకాలము 5-30 గంటలకు గాన సభారంభము. దిగువ పొందుపరచిన రీతిని ఆ యా గాయకు లా యా కీర్తనలను పాడిరి. విజయవాడ రేడియో విద్వాంసులు శ్రీ అన్నవరం రామస్వామిగారు ఫిడేలును, శ్రీ యల్లా సోమన్నగారు మృదంగమును, గాన మంతకును వాయించిరి.

వివరణము:—

(1) శ్రీమతి జె. అరుంధతిగారు:—

| (సంకీర్తన) | | (రాగము) |
|---|---|---|
| 1. నిక్కముగ | ... | రామక్రియ. |
| 2. సామాన్యమా | ... | ధన్యాసి. |
| 3. దిబ్బలు వెట్టుచు | ... | కాంబోజి. |
| 4. లలితలావణ్య | ... | ఆహిరి. |

## (2) శ్రీ యస్. పి. ఆర్. విఠలరావుగారు :—

| ( సంకీర్తన ) | ( రాగము ) |
|---|---|
| 1. నారాయణతే నమో నమో ... | షణ్ముఖప్రియ. |
| 2. ఉప్పవడము కావయ్య ... | కాంభోజి. |
| 3. ఇందరికినభయంబునిచ్చుచేయి ... | వసంత. |
| 4. వాడె వెంకటాద్రిమీద ... | పంతువరాళి. |

## (3) శ్రీ యన్. కృష్ణమూర్తిగారు :—

| ( సంకీర్తన ) | ( రాగము ) |
|---|---|
| 1. అలరులు కురియగ ... | శంకరాభరణము. |
| 2. దేవ దేవంభజే ... | ధన్యాసి. |
| 3. సడిబెట్టె కటకటా ... | సావేరి. |

శ్రీ యన్. కృష్ణమూర్తిగారి గానానంతరము అన్నమాచార్య వంశ్యులగు శ్రీ తాళ్లపాక సూర్యనారాయణయ్యగారి కుమార్తె శ్రీమతి తాళ్లపాక సుమిత్ర భరతనాట్యమునుజేసి సభ్యులకు వినోదమును గలిగించెను. 'ఇందరికి నభయంబు నిచ్చుచేయి' అను కీర్తనయొక్క భావాభినయము నామె ప్రదర్శించెను. కీర్తనను పాడిన శ్రీ కె. సి. నరసింహాచారిగారు, నాట్య ప్రదర్శనము రంజకమగుటకు మిగులఁ దోడ్పడిరి.

(4) శ్రీ సి. వేంకటేశ్వరశర్మగారు:—

| (సంకీర్తన) | | (రాగము) |
|---|---|---|
| 1. నీవుగాగా నేనుగాగా | ... | కేదారగౌళ. |
| 2. సేవింతురా యితని | ... | ముఖారి. |
| 3. మొత్తకురే అమ్మలారా | ... | కాంభోజి. |
| 4. నీ వికయింకననన్యము. | ... | శ్రీరాగము. |

(5) శ్రీ టి. జి. యస్. వీరరాఘవాచారిగారు:—

| (సంకీర్తన) | | (రాగము) |
|---|---|---|
| 1. చూడ జూడ మాణిక్యాలు | ... | తోడి. |
| 2. హరియవతారమె | ... | చక్రవాకము. |
| 3. శరణంటి మాతని | ... | రాగమాలిక. |
| 4. లలితలావణ్య | ... | వసంత. |

(6) శ్రీ యన్. నరసింహులుగారు:—

| (సంకీర్తన) | | (రాగము) |
|---|---|---|
| 1. ఇందు నుండన్ | ... | ఆరభి. |
| 2. అలరులు కురియగ | ... | శంకరాభరణము. |
| 3. ఏమిచేసితి నేను | ... | తోడి. |

గాయకులందరును మిక్కిలి యనుభవముగలవారు. గానామృతము నాస్వాదించి సభ్యులెల్లరు మైమరచిరి. ఒక్కొక్కరి గాన మొక్కొక గంటసేపు జరిగెను. తరువాత శ్రీ స్వామికి

మంగళహారతి నిచ్చుటతో రాత్రి 12 గంటలకు రెండవనాఁటి కార్యక్రమము పరిసమాప్తమయ్యెను.

13–4–1953 తేదీ ఉదయము 7-30 గంటలకు ఉత్సవపు మూఁడవనాఁటి కార్యక్రమము ప్రారంభమాయెను. శ్రీ వేంకటేశ్వర ప్రాచ్యవిద్యాలయాధ్యాపకులు శ్రీ అప్పల సోమేశ్వర శర్మగారి వరణముపై నాఁటిసభకు, శ్రీ వేంకటేశ్వర ప్రాచ్యపరిశోధనాలయ సంగీతాచార్యులు శ్రీ రాళ్లపల్లి అనంతకృష్ణశర్మ గారు అధ్యక్షులుగనుండిరి. శ్రీ వేంకటేశ్వర కళాశాలలో హిందీ ఉపన్యాసకులు శ్రీ అయాచితుల హనుమచ్ఛాస్త్రిగారు గంభీరముగ నుపన్యసించిరి. అన్నమాచార్య సాహిత్యమును, హిందీ పదసాహిత్యమును తులనాత్మకముగఁ బరిశీలించుచు సాహిత్యదృష్టి—తత్త్వదృష్టి—అను రెండు ప్రధానదృష్టులతో అన్నమాచార్య మాహాత్మ్యమును విశదముచేసి సభ్యుల సంతోష పెట్టిరి. (చూ—అనుబంధము. 5.) పిదప శ్రీ రాళ్లపల్లి అనంత కృష్ణశర్మగారు అధ్యక్షోపన్యాసముఁజేయుచు నాంధ్రపద సాహిత్య చరితమును సొంపుగను, సంగ్రహముగను, ఉద్ఘాటించి, అందు అన్నమాచార్య సాహిత్యమునకుఁగల ఉత్తమ స్థానము నెన్నిచూపిరి. (చూ—అనుబంధము. 6.) అవల కృతజ్ఞతా నివేదనము, మంగళహారతియు జరిగెను. 11 గంటలకు ఉదయము కార్యక్రమము ముగిసెను.

సాయంకాలము 5-30 గంటలకు గానసభ మొదలయ్యెను. దిగువఁ జూపిన విధమున నా యా గాయకులా యా సంకీర్తనలను పాడిరి.

వివరణము :—

(1) శ్రీ కె. మల్లికార్జునరావుగారు :—

| (సంకీర్తన) | | (రాగము) |
|---|---|---|
| 1. సురులకు నరులకు | ... | నాట. |
| 2. దినము ద్వాదశి నేఁడు | ... | శ్రీరాగం. |
| 3. హరి యవతారమె | ... | సౌరాష్ట్రం. |
| 4. పుట్టుభోగులము | ... | పాడి. |
| 5. నీ దాసుల భంగములు | ... | ... |
| 6. దాసవర్గముల కెల్ల | ... | ... |
| 7. అదివో అల్లదివో | ... | శ్రీరాగం. |
| 8. తందనాన ఆహి | ... | బౌళి. |
| 9. నానాదిక్కుల నరులెల్ల | ... | ఆహిరి. |
| 10. ఇతరులకు నిను నెరుగ | ... | శ్రీరాగం. |

(2) శ్రీ సి. సుబ్రహ్మణ్యంపిళ్లెగారు :—

| (సంకీర్తన) | | (రాగము) |
|---|---|---|
| 1. కట్టెదుట వైకుంఠం | ... | మాయామాళవగౌళ. |
| 2. సేవించి చేకొన్నవారి చేతి | ... | కల్యాణి. |

| | | |
|---|---|---|
| 3. రామచంద్రా రామభద్రా | ... | హిందోళం. |
| 4. పొడగంటిమయ్యా మిమ్ము | ... | శంకరాభరణం. |
| 5. రమ్మనవే వాని | ... | కేదారగౌళ. |

(3) శ్రీ వి. వరదరాజయ్యంగారు :—

| (సంకీర్తన) | | (రాగము) |
|---|---|---|
| 1. ఏమని చెపుదుమమ్మా | ... | శంకరాభరణం. |
| 2. ఎవ్వరి వాడా గాను | ... | వరాళి. |
| 3. అనరాదు వినరాదు | ... | భైరవి. |

(4) శ్రీ యమ్. సూర్యనారాయణమూర్తిగారు :—

| (సంకీర్తన) | | (రాగము) |
|---|---|---|
| 1. తెలిసిన తెలియుడు | ... | నాట. |
| 2. వందేహమ్ | ... | బౌళి. |
| 3. నానాదిక్కులు | ... | ఆహిరి. |
| 4. అలుగక కూటమి | ... | బిలహరి. |
| 5. దేవ దేవం భజే | ... | ధన్యాసి. |

(5) శ్రీమతి డి. శ్యామలగారు :—

| (సంకీర్తన) | | (రాగము) |
|---|---|---|
| 1. నల్లనిమేను | ... | నాట. |
| 2. సామాన్యమా | ... | ధన్యాసి. |
| 4. తెలిసినవారికి | ... | చాపలాస్. |
| 3. నిత్యాత్ముడై | ... | శ్రీరాగం. |
| 5. ఇందుకొరకే | ... | మాళవి. |

గాయకులందరును ప్రథితయశస్కులు అతిమధురముగ గానము సలిపిరి. శ్రీ అన్నవరం రామస్వామిగారు ఫిడేలును, శ్రీ యల్లా సోమన్నగారు మృదంగమును వాయించిరి. సభ్యు లందరు నానందసాగరమున మునుకలువై చి తేలిరి.

పిదప 12-గంటలకు శ్రీ వేంకటేశ్వర ప్రాచ్యపరిశోధనా లయ కులపతులు శ్రీ పరవస్తు వేంకటరామానుజస్వామిగారు పై యుత్సవమునఁ బాల్గొని సంకీర్తనముల గానముచేసి సభ్యుల నానందపరచిన గాయకులందరకు, ఉత్సవసందర్భమున బహు విధములుగఁ దమకుఁ దోడ్పడి కార్యక్రమమును నిర్విఘ్నముగ నిర్వహింపఁజేసిన వారందరకు, దేవస్థానాధికారులందరకు, ఉత్సవ కార్యక్రమమును జరుపుకొనుటకుఁ దమ మండపమునొసంగిన శ్రీ త్యాగరాజోత్సవ నిర్వాహక వర్గమువారందరకు, కీర్తనలను రికార్డు చేయవచ్చిన A. I. R. విజయవాడ కేంద్రము వారలకు, సర్వులకును, దమకృతజ్ఞతాభి వందనముల నర్పించిరి.

ఆలిండియారేడియో, విజయవాడ కేంద్రమువారు 11, 12, 13, తేదీలు మూఁడు దినములును గాయకులు పాడిన సంకీర్తనములను రికార్డుచేసి ప్రసారముగావించిరి. శ్రీ తిరుమల తిరుపతి దేవస్థానము టెక్నిషియనులు గూడ పై సంకీర్తనల నన్నింటిని రికార్డుచేసిరి. తరువాత శ్రీ వేంకటేశ్వరస్వామివారికి మంగళహారతి సమర్పణము జరుగుటతోడనే ఉత్సవముయొక్క మూఁడవనాఁటి కార్యక్రమము ముగిసెను.

తుదకు శ్రీ అన్నమాచార్య పెదతిరుమలాచార్యుల విగ్రహములను, శ్రీ వేంకటేశ్వరస్వామి పటమును, మేళతాళములతో వేంచేపుచేయించి యూరేగించి శ్రీ వేంకటేశ్వర ప్రాచ్య పరిశోధనాలయమున యథాస్థానమునఁ బ్రతిష్ఠించిరి. ఈ విధముగ శ్రీ అన్నమాచార్య పంచమ వార్షికోత్సవ మతివైభవముగ జరిగి శుభాంతముగఁ బరిసమాప్తినొందెను.

శ్రీః

అనుబంధము 1.

శ్రీ వేంకటేశ్వర ప్రాచ్యపరిశోధనాలయము, తిరుపతి

# శ్రీ అన్నమాచార్యోత్సవము

అయిదవ వత్సరము.

## స్వాగతోపన్యాసము.

శ్రీ ప॥ వెం॥ రామానుజస్వామి.

అధ్యక్షమహాశయా, సభ్యులారా,

ఇది అన్నమాచార్య స్మారకోత్సవములలో నైదవది. ఈ యుత్సవమునకు అధ్యక్షత వహింపుమని ఆంధ్రవిశ్వకళా పరిషత్తు ప్రోఛాన్సెలరుగారగు శ్రీ బెజవాడ గోపాలరెడ్డిగారిని కోరితిమి. వారు మాకోరికను మన్నించి దయతో నంగీకరించిరి. దానికి వారికి మేము కృతజ్ఞులముగా నుండుటయే కాక వారికి మా మనఃపూర్వకమగు స్వాగతము నిచ్చుచున్నాము. సభ్యమహాశయులందరును మా యాహ్వానము నంగీకరించి దయ చేసినందుకు వారికి కూడ మా స్వాగతము. ఇది మా ప్రథమ కర్తవ్యము.

గతవత్సర మీ యుత్సవము ఏప్రిల్ నెల 10, 11 తేదులలో జరిగినదని మీకు జ్ఞప్తియుండవచ్చును. అప్పుడు మా యాహ్వానము నంగీకరించి యుత్సవమున బాల్గొనిన గాయకు లందరకును మేము కృతజ్ఞులము. తాళ్ళపాక అన్నమాచార్యుడు 500 సంవత్సరములకు బూర్వము శ్రీ వేంకటేశ్వరస్వామి మీద ననేకవేల సంకీర్తనలను వ్రాసి పాడెను. అప్పుడు తిరుపతి కుగ్రామముగానుండి యాతనికి శిష్యులు లేకపోవుటచే నతని సంకీర్తనలు ప్రచారములోనికి రాలేదు. కాని యతని సంకీర్తనములలో మాధుర్యము, భావగాంభీర్యము భాషావైశిష్ట్యము లేకపోలేదు. ఈ విషయములను గమనించి యీ దేవస్థానము వారు వానిని ప్రచారములోనికి తెచ్చుటకు ప్రయత్నముల నారంభించిరి. వానిలో మొదటిది సంకీర్తనములను అచ్చువేసి ప్రచురించుట. రాగిరేకులమీద చెక్కబడియున్న సంకీర్తనములను చూచి వ్రాసి సరిదిద్ది ప్రచురించుచున్నాము. గత వత్సరము ఉత్సవము నాటికి 7 సంపుటములలో సంకీర్తనములు ప్రచురింపబడినవని నా నివేదికలో చెప్పియుంటిని. అప్పటి నుండి యిప్పటికి మరి 3 సంపుటముల సంకీర్తనములు ప్రచురింపబడినవి. ఇదికాక మా పరిశోధనాలయములో సంగీతాచార్యులుగానుండి పై సంకీర్తన సంపుటములను తయారు చేయుచున్న శ్రీమాన్ రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మగారు స్వరపరచిన 54 సంకీర్తనములు కల యొక సంపుటముగూడ ప్రకటింపబడినది. దీని

ప్రతులను మా యుత్సవమున కీసంవత్సర మాహూతులగు గాయకులందరకును పంపియుంటిమి. స్వరములేక యీ సంకీర్తనములు ఇదివరలో ప్రచారములోనికి రాలేదను కొరతకూడ దీనివలన తీరునని మా నమ్మకము. గాయకులందరును దీనిని విరివిగా నుపయోగించుకొని యీ సంకీర్తనములను ఇంకను అధికముగా ప్రచారములోనికి తేవలయునని మా ప్రార్థన.

పోయినవత్సర ముత్సవకార్యక్రమములో కొంచెము మార్పు చేయబడినది. గాయకుల నాహ్వానించి కీర్తనములను పాడించుటయేకాక అన్నమాచార్య తత్కృతులనుగురించి యుపన్యాసములు కూడ నేర్పాటుచేయబడినవి. ఈ సంవత్సరముగూడ నట్లె యుపన్యాసముల నీయుటకు సమ్మతించిన మా పరిశోధనాలయములోని యాంధ్రభాషా పరిశోధకులగు శ్రీ కోరాడ రామకృష్ణయ్యగారికిని శ్రీ అయాచితుల హనుమచ్ఛాస్త్రిగారికిని మేము కృతజ్ఞులము.

అన్నమాచార్యుని సంకీర్తనములను ప్రచారములోనికి తెచ్చుటకు మేము చేయుచున్న ప్రయత్నములలో రెండవది యీ యుత్సవమును జరిగించుట. అన్నమార్యుని జన్మదినమున గాని నిర్యాణదినమునగాని యతనిపేరున నొక యుత్సవమును జరిపి గాయకుల నాహ్వానించి వారిచే అన్నమాచార్యుని సంకీర్తనములను పాడించుటకు నిర్ణయము చేయబడినది. జన్మ

దినము వైశాఖ శుద్ధ పౌర్ణమి. అది మండు వేసంగిలోను పాఠశాల లన్నిటికిని విరామదినములలోను పడుటచే దానిని విడచి నిర్యాణదినమగు ఫాల్గుణ బహుళ ద్వాదశి గ్రహించ బడినది. ఆ దినమున చేయవలసినదే కాని యీ సంవత్సరమది పరీక్ష దినములలో పడుటచే నేడు అనగా చైత్ర బహుళ ద్వాదశినాడు జరుపబడుచున్నది. ఈ యుత్సవములలో సాధ్యమైనంతవరకు అన్నమాచార్యుని కీర్తనములనే పాడవలయునని గాయకులకు మా ప్రార్థన. మా ప్రార్థన నంగీకరించి గాయకులందరును దయతో నట్లే చేయుచున్నారు. ఈ సంవత్సరమున నట్లు మేము ఆహ్వానించిన గాయకులందురు మా యాహ్వానము నంగీకరించి యుత్సవమున పాల్గొనుటకు వచ్చినందుకు మేము కృతజ్ఞులము. వారికందరికిని మా హృదయ పూర్వకమగు స్వాగతమందజేయుచున్నాము. ఆలిండియా రేడియో విజయవాడ కేంద్రమువారు ప్రతిసంవత్సరమును వచ్చి మే మాహ్వానించిన గాయకుల సంగీతమును రికార్డుచేసి ప్రసారము చేయుచున్నారు. ఇట్లు వారు మా యుద్యమమునకు సహాయపడుటచే వారికి మే మెంతయు కృతజ్ఞులము. ఇదిగాక వారి విద్వాంసులను మా యుత్సవములో పాల్గొనుటకు అనుమతించి మా యుత్సవమునకు సహాయపడినందుకు కూడ వారికి మేము కృతజ్ఞులము. ఈ సంవత్సరము కూడ విజయవాడ కేంద్రము వారు రికార్డుచేయుటకు వచ్చియున్నారు. విజయవాడనుండి

యిద్దరు విద్వాంసులును, మైసూరునుండి మరి యిద్దరు విద్వాంసులును ప్రక్క-వాద్యముల సహాయమునకు వచ్చియున్నారు. మదరాసు కేంద్రమునకు సంబంధించిన యనేక గాయకులు ఉత్సవములో పాల్గొనుటకు వచ్చియున్నారు. ఇంకను ఆలిండియా రేడియోవారు వారి ప్రసారములలో అన్నమాచార్యుని సంకీర్తనములను తరచుగా చేర్చి మా యుద్యమమునకు సహాయము చేయుచున్నారు. ఇందుకు గూడ వారికి మేము మిక్కిలి కృతజ్ఞులము. వారేకాక మనదేశములోని గాయకులందరును అన్నమాచార్యుని సంకీర్తనములను దరచు పాడి ప్రచారములోనికి దేవలయునని మా ప్రార్థన. దీనికి మే మచ్చు వేసిన స్వరసహితమగు పాటల సంపుటము సహాయపడగలదు. ఇట్లు మరికొన్ని పాటలను స్వరముతో ప్రచురింపదలంచి యున్నాము. ఇట్లు స్వరపరచిన కీర్తనలు ఇంకను విపుల ప్రచారమునకై దేవస్థానమువారు ప్రచురించుచున్న 'బులెటిన్' లో నెలకొకటి చొప్పున ప్రకటింపబడుచున్నవి.

ఈ సంకీర్తనములను ప్రచారములోనికి దెచ్చుటకు మేము చేయుచున్న ప్రయత్నములలో మూడవది సంకీర్తన పోటీ పరీక్ష. పాఠశాలలోని అన్నమాచార్యుని పాటలను నలవరచుకొని పాడగల పిల్లల నాహ్వానించి, వారిచే పాడించి, అట్లు పాడినవారికి బహుమతుల నేర్పాటుచేసినాము. ఇందుకొరకు కొన్ని సంకీర్తనములను యేంచి చిన్న పుస్తకముగా ముద్రించి

కోరినవారి కందరికిని నుచితముగా పంపుచున్నాము. ఈ సంవత్సర మీ పోటీపరీక్ష నిన్నను సాయంకాలము జరిగినది. ఈ పోటీపరీక్షలో నర్హతలను నిర్ణయించుటకు మాకు సహాయపడిన శ్రీ రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మగారికిని శ్రీ చివుకుల సుబ్రహ్మణ్యముగారికిని మేము కృతజ్ఞులము. ఇట్లేకాక యింక ననేక విధముల మా యుత్సవమునకు శ్రీ సుబ్రహ్మణ్యముగారు సహాయపడుచున్నారు. అందుకు వారికి తిరిగియు మా కృతజ్ఞత దెలుపుకొనుచున్నాము.

అన్నమాచార్యుల సంకీర్తనములను ప్రచారములోనికి తెచ్చుటకు దేవస్థానమువా రవలంబించిన మరియొక పద్ధతి కలదు. ఇటీవల మా యధికారులు మాటలను రికార్డుచేయు యంత్ర సాధనమును తెప్పించియున్నారు. దాని సహాయమున నీ యుత్సవములో గాయకులు గానము చేసిన పాటలను రికార్డు చేసి, యుత్సవాంతరములలోను యాత్రికులు విశేషముగా జేరు సత్రములోను వినిపించుచున్నారు. దీనివలన శ్రోతలకు ఆ సంకీర్తనల యందాసక్తికలిగి వానిని గానము చేయవచ్చును. సినీమాలలోని పాటలను విని యెందరో వానిని తిరిగి పాడుచున్నారుకదా! అట్లే వీనిని విన్నవారుకూడ ప్రచారములోనికి తేవచ్చును. ఇట్లన్నివిధములుగా ప్రయత్నములు చేయుటచే అన్నమాచార్యుల పాటలు మునుపటికంటె నధికముగా లోకములో వ్యాపించినవని నమ్ముట కవకాశము కలదు. ఇంకను

గొన్ని సంవత్సరము లిట్టి ప్రచార మవిచ్ఛిన్నముగా జరిగినచో అన్నమాచార్యుని పాటలు త్యాగరాజాదుల పాటలవలె సార్వజనీనమగునని మా నమ్మకము.

ఈ యుత్సవ నిర్వహణమునకు మా కనేకులు సహాయపడియున్నారు. వారి కందరికిని మా కృతజ్ఞతను నివేదించుకొనుట మా విధియై యున్నది. అందులో ముఖ్యులు శ్రీ త్యాగరాజోత్సవ కార్య నిర్వాహక వర్గమువారు. వారీ యుత్సవము ను జరుపుటకు ప్రథమమునుండియు వారి స్థలమునిచ్చి మాకు సహాయపడుచున్నారు. లేనిచో గ్రామసమీపమున నిట్టి విశాలమగు స్థలము ఈ యుత్సవమునకు మాకు దుర్లభమగును. వారి దయవలననే యింతమంది యుత్సవమునకు సమావేశులై సుఖాసీనులగుటకు వీలు కలిగినది. మరియు నా కార్యనిర్వాహక వర్గములోని వారు మా కనేక విధముల మా కార్యకలాపములో దోడ్పడుచున్నారు. అందులో ముఖ్యులు శ్రీయుతులు కే. నారాయణరావుగారు. వారి కందరికిని మా కృతజ్ఞత నిండుమూలముగా దెలుపుకొనుచున్నాము. మా పరిశోధనాలయములోని యుద్యోగులును బాలశాలలోని పండితులును మేము కోరిన వారందరును మా కనేక విధముల సహాయపడుచున్నారు. వారికిని వారికి సహాయపడుటకు పిలిచిన వెంటనే వచ్చిన విద్యార్థులకును మేము చాల కృతజ్ఞులము. మా యాహ్వానము నంగీకరించి యిచ్చుటకై దయచేసి

యీ యుత్సవమును జయప్రదముగా జరుగునట్లు చేసిన ప్రేక్షకులకును శ్రోతలకును మేముకృతజ్ఞులము. మేము మా యాహ్వానముల నందరికిని నందజేయుటకు ప్రయత్నించితిమి కాని కొందరి కందియుండక పోవచ్చును. అట్టివారి నందరిని యిప్పు డాహ్వానించుచున్నాము. ఈ యుత్సవమున కందరును దయచేయ వచ్చును.

తిరుపతి
11–3–53

## అనుబంధము 2

అధ్యక్షోపన్యాసము :— శ్రీ బెజవాడ గోపాలరెడ్డిగారు

సహృదయవర్యులారా!

ఈ అన్నమాచార్య పంచమ వార్షికోత్సవమునకు నన్ను అధ్యక్షునిగ నాహ్వానించుట నా కెంతయు సంతసమును గలుగఁ జేసినది. తరచుగ వచ్చుచుండు వివిధములగు నాహ్వానములలో నిట్టి పవిత్రోత్సవాహ్వానములే నాకుఁ గడుంగడు నభిమతములు. నా యదృష్టవశమున తిరువయ్యారులో 1950 సంవత్సరమున జరిగిన శ్రీ త్యాగరాజారాధనోత్సవములకు నన్నధ్యక్షునిగ నాహ్వానించుట, నే నా పనిని నిర్వహించుటయు జరిగెను. ఇటీవల మరల మన ముఖ్యమంత్రి శ్రీ రాజగోపాలాచార్యులుగారితో

గలిసి యా యుత్సవమును దర్శించితిని. బ్రహ్మానందము కలిగెను. నేఁడు మరల నా కట్టియానందమును గలుగఁజేయ నిట్టి యవకాశము నిచ్చినందులకు శ్రీ తిరుమల తిరుపతి దేవస్థానము కమిటీ వారికి నా కృతజ్ఞతను దెలుపుకొనుచున్నాను.

శ్రీ అన్నమాచార్యుఁడు మహాత్ముఁడు. అయిదు వందల యేండ్లకుఁబూర్వము మహాభక్తిపారవశ్యముతో డెబ్బది తొమ్మిదేడుల జీవితమును గడిపిన భక్తశిఖామణి. పురాణాదులలో, కావ్యములలో, నాటకములలో, గేయములలో నెక్కడను కని విని యెఱుఁగని భక్త్యావేశ మతనిది. అన్నమయ్య జన్మదివసము వైశాఖపూర్ణిమ. అద్దానికి మనదేశమున గొప్పవైశిష్ట్యమున్నది. అదియే మహానుభావుఁడైన గౌతమబుద్ధుని యవతారదినము. బుద్ధుని యుపదేశములకు అన్నమయ్య ఉపదేశములకును జాల పోలికలున్నవి. కాని బుద్ధునియంతవాఁ డన్నమయ్య యని చెప్పవచ్చును. ఇట్టి యంశములను మనబోంట్లు గుర్తించుటకో యన నొక్కొ-క్క-ప్పు డతి చిత్రముగ మహామహుల యవతారాది విషయములలో సంవాదము గోచరించుచుండును. త్యాగరాజు నిర్యాణము గాంధిమహాత్ముని నిర్యాణము నొకే దినమున జరిగెను. ఆ రామభక్తుఁడు నీ రామభక్తుడు నొకే దినమున నిర్యాణమును బొందుట చిత్రము గాదా! ఈ యంశమునే లోఁగడ నేను బడ్జెటుచర్చలోఁ గూడ చెప్పియుంటిని.

దాక్షిణాత్య భక్తులలో నగ్రగణ్యుఁ డగు త్యాగయ్య వలెనే అన్నమయ్య గూడ అపూర్వమైన భక్తిపారవశ్యమును కనఁబరచినాఁడు. చీకటిలో–వెన్నెలలో–ఎండలో–వానలో–ఉష్ణములో – శైత్యములో – ఇది యది యేమి – సర్వకాల సర్వావస్థలయందును అతఁడు తన భక్త్యుద్రేకమును వీడలేదు. అతని యొక్కొక కీర్తనలోను ఈ యంశము ప్రతిబింబించుచునే యుండును. నిన్నటిదినమున నేను తిరుమలకు వెళ్ళినపుడు అచటి రాళ్ళు – శిల్పములు – చెట్లు – పుట్టలు – మెట్టలు – గుట్టలు అన్నియు మా అన్నమాచార్య కీర్తనలకుఁ దగినంత ప్రచారము లేదని విచారించుచున్నవా యన్నట్లు నాకుఁ దోఁచెను. అన్నమాచార్యుఁడు ప్రథమ సంకీర్తనాచార్యుఁడు. మన మందరము సామాన్యముగ వివిధ కుసుమములతో శ్రీ వేంకటేశ్వరుని అర్చించుచుందుము. కాని అన్నమయ్య సంకీర్తన కుసుమముల తోనే శ్రీనివాసు నర్చించెను. దినమున కొక్క సంకీర్తన కుసుమము నును గూర్చెను. అరువదినాలుగేండ్లు భక్తజీవితములోఁ గొన్ని వేల కీర్తనలు సిద్ధమయినవి. ఆనాడు వానిముద్రణ మెట్లు? అశక్యము. అసంభావ్యము. ఎట్లో ఆ వేంకటేశ్వరభక్తుని పుత్రాదులు రాగిరేకులపై నా సంకీర్తనలను భద్రపరచిరి. కాని ఏమి దుర్ఘటనయో – ఏమి శాపమో – కాలమే అసూయపడి దాచినదా యన్నట్లు–మొన్నటివరకు నవి దాఁగియే యుండినవి. ఈనాఁటికైన శ్రీ వేంకటేశ్వర ప్రాచ్య పరిశోధనాలయము వారి

బహుముఖ ప్రయత్నమువలన నవి బయటఁబడి ముద్రణప్రచారాది భాగ్యములను బొందుట యాంధ్రజాతి యదృష్టమే యనక తప్పదు. అన్నమాచార్య సంకీర్తనసాగర మొకటి కలదను వినుకలి తప్ప వేరొండు శక్యముకాకుండిన స్థితిలో నా యజ్ఞాతవాస విమోచనమును గలుగఁజేసి యా సాగరమును జూపి యందు మాదృశుల నుుంచెత్తించు శ్రీ దేవస్థానాధికారులకు – ప్రాచ్య పరిశోధనాలయమువారికి – ఇంక నెవ్వరయిననుసరియే – వా రందరికి నా నమోవాకములు. వారు చేసినది ఘనకార్యము. పండితులఁ బోషించుట యొకయెత్తు. ఇట్టి పనిని జేయించుట వేరొకయెత్తు. ఈ కార్యమునకు మార్గదర్శకులయిన కీ. శే. శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారు చిరస్మరణీయులు. ప్రకృతము శ్రీ రాళ్ళపల్లి అనంతకృష్ణ శర్మగారవశిష్టకార్యము లన్నిటికై – (అనఁగా స్వరకల్పన – బహుళప్రచారము – మొదలగువానికై) పూనికతోఁ బని చేయుచుండుట మిక్కిలి సంతోషమును గలిగించుచున్నది.

ఈ సందర్భమున నాబుద్ధికిఁ దోఁచిన కొన్ని కర్తవ్యములను గూడ మనవిచేయుట యనుచితముగాదని భావించి యట్లు చేయుచున్నాను. త్యాగయ్య, క్షేత్రయ్య, రామదాసుల కంటె అన్నమయ్య ప్రాచీనుఁడు. అతఁడు పరమపదించి దాదాపు నాలుగువందల యేఁబదియేండ్లయినది. ప్రబంధకవులకుఁ గూడఁ బూర్వుఁడే యితఁడు. నాఁటి సంగీతసాహిత్యముల స్వరూప

మెట్లుండెడిదో సరిగఁజెప్పుట కష్టము. నేఁడు ఆ రెండిటి విషయము నను విపరీతమైన మార్పులు కలుగుచున్నవి. సినీమా, రేడియో, మొదలగునవి సంగీతమునందలి మార్పులకు, అవియుఁ బత్రికలు మొదలగునవియు సాహిత్యమందలి మార్పులకును ముఖ్య కారణములు. ప్రజాభిరుచియు నట్టిమార్పుల కనుగుణముగనే యున్నవి. అన్నివిషయములలోను సంయమమునభిలషించు వారు కొందరు, స్వేచ్ఛనభిలషించువారు మరికొందరును సాధా రణముగ నెల్లపుడునుందురుగాని నేఁడు రెండవపక్షమువారే యత్యధిక సంఖ్యాకులయియున్నారు. కావుననే సంగీతసాహి త్యములలోనేగాక సంఘము జాతి ఆచారము సంప్రదాయము అన్నింటిలోను బరస్పరవిరుద్ధములయినపరిణామములుక్షణక్షణము గలుగుచున్నందువలనఁ బరస్పరసమన్వయ మెట్లో తెలియక కింకర్తవ్యతావిమూఢులమై యుండవలసి వచ్చుచున్నది. ముందటి క్షణమున నెట్టి మార్పు కలుగనున్నదో ఎవరును జెప్పలేకున్నారు. చెప్పలేరు కూడ. ఏవరైన సరిగనట్లు చెప్పఁ గలిగినచో నట్టివారికి గొప్పపారితోషికము నీయవచ్చును. పరిస్థి తులంత ఊహాతీతముగా నున్నవని నాతాత్పర్యము. ముఖ్యముగ సంగీతవిషయమున శాస్త్రీయసంగీత, సినీమాసంగీతములకు, సాహిత్యవిషయమున గ్రాంధిక, వ్యావహారికములకును సమ న్వయమెట్లో-అనుసరణీయమగు మార్గమేదో-నేఁటికిని నిశ్చయిం పఁబడలేదు. నిశ్చయింపఁబడునను నమ్మకము గూడఁ గలుగ

కున్నది. ఇట్టి విషమస్థితిలో నాఁటి అన్నమాచార్యసంగీత సంప్రదాయములను సాహిత్యసంప్రదాయములను విశేషముగఁ బరిశోధించి గుర్తించి, వానిని బ్రకటించి ప్రజలలో వ్యాపింపఁ జేయు భారము శ్రీ అనంతకృష్ణశర్మగారి వంటి విజ్ఞులపై నున్నది. అయ్యది వారికుచితము. పిదప నాసంప్రదాయముల నాదరించుటయో తిరస్కరించుటయో అదిప్రజలవిషయము. అదివేరు. అన్నమాచార్యసంగీత సాహిత్యము లతి ప్రాచీనములు. అన్నమయ్య, గోపన్న, త్యాగయ్య, వీరందరునొకే శ్రేణికిఁ జెందినవారు. భక్తియోగమునకై జీవితమునంకితము చేసినవారు. వీరందరి సంప్రదాయములను దులనాత్మకముగ శోధించి యందన్నమయ్యకుఁగల స్థానమును నిర్ణయించుట మనవిధి. ఇతరుల సంపదనభివృద్ధిచేయుటయందే మన గొప్పదనమిమిడి యుండును గదా! అది భగవత్కృపవలన సంతృప్తికరముగ నిర్వహింపఁబడు గాక.

మరియొక మాట. అన్నమాచార్యుల పేరుతో నీ తిరుపతి నగరమున నొక సంగీతకలాశాల తప్పక స్థాపింపఁబడ వలయును. శాస్త్రాంతరములకుఁ గలాశాల యిచట నున్నది. పెక్కు శాస్త్రములలోఁ బండితులిచటఁ దయారగుచున్నారు. సంతసమే. సాహిత్యముగంగానది వంటిది. పండితులు లేకున్న నది వ్యర్థమగును. పండితులు సాహిత్యదుర్గరక్షకులు. వారు తప్పక సతము విరాజిల్లవలసినదే. కాని శాస్త్రాంతరములతోఁ బాటు

సంగీతమును గూడ నాదరించక తీరదు. ప్రతియొకరు సంగీత విద్వాంసులు కావలయును. అట్టివారిని సిద్ధముచేయుటకు సంగీత కలాశాల యొకటుండవలయును. నేఁడు రాజకీయములను మాటాడఁదలచలేదు. వానివలన అనవసరముగ నుద్రేకములు బయలుదేరును. మొత్తముపై నాంధ్రదేశములోఁ గర్ణాటక సంగీతాదరము చాల తక్కువగ నున్నదని మాత్రము చెప్పఁ గలను. ఆపద్ధతి యుక్తముగాదు. గాత్రమున దాక్షిణాత్యులతోఁ బోల్చి చూచుకొనినచో సరితూగఁదగిన వారాంధ్రులలో నున్నారా — యని పించును. దాక్షిణాత్యులనుండి మనము నేర్వఁదగిన యనేకవిషయములలోఁ గర్ణాటక సంగీతమొకటి. అనాదరములేక శ్రద్ధతో మనము దానినభ్యసింపవలయును. సంగీత సంప్రదాయము తెలుఁగు జిల్లాలలో విరజిమ్మఁబడ వలయును. ఆంధ్రదేశమున విజయనగరములో మాత్రమొక సంగీతకలాశాల యున్నది. అదియొక చివరనుండిపోయినది. ఈ చివరను రెండవ సంగీతకలాశాలయుండవలయును. రాజా స్థానములు, దేవస్థానములునే చిరకాలమునుండి కళాపోషకములుగ నున్నవి. ప్రకృతము రాజాస్థానములు లేవు. కాన సంపూర్ణ కళాపోషణభారము నిట్టి దేవస్థానములే వహించక తప్పదు. కాశీ హిందూవిశ్వవిద్యాలయములో నన్నిరకముల విద్యార్థులును సంస్కృతము సంగీతము అనువానిని కొద్దిగనో గొప్పగనో తప్పక అభ్యసించుదురు. అట్లే యీ తిరుపతి విద్యాలయములందును జరుగవలయును.

నే నిటీవల నుత్తరదేశ పర్యటనచేసినపుడు, శాంతినికేతనమునం బూర్వముకన్న నిపుడు సంగీతప్రాధాన్యమధికమైనట్లు గ్రహించితిని. బెంగాలువారు రవీంద్రుని సంగీత ప్రచారమున కత్యధికముగ కృషిసల్పుచున్నారు. టాగూరు మహాశయుఁడు మూఁడువేల కీర్తనలను రచించినాఁడు. వంగీయులందరును వానిని బాడుదురు. వారు పద్యములను పాడరు. కీర్తనలనే పాడుదురు. ఈ యంశమునం దెలుఁగునాఁట వైపరీత్యమున్నది. పద్యములను దారాపథమంటునట్లు పాడునలవాటు మన తెలుఁగు గడ్డను విడిచిన నింకెక్కడను గనఁబడదు. కానిండు. రవీంద్ర కీర్తనల పుస్తకములు అయిదులక్షలయెనుబదివేల రూపాయల వరకు నిటీవల నమ్మఁబడుట నాకుఁ దెలియును. తెలుఁగు దేశమున సాహిత్యమున కింతటి యాదరణయున్నదా ? ఏ యొక పుస్తకమైన నింత విలువను సంపాదింపఁ గల్గెనా ? మన స్థితి యెంత నీచముగనున్నదో చూడుఁడు. ఈ స్థితి మారిపోవలయును. వంగీయులవలె నాంధ్రులును కళాభిమానులు గావలయును. ఆంధ్రుల విస్మృత వైభవము పునరుద్ధరింపఁ బడవలయును.

గంగాదేవిని గంగతోనే పూజించునట్లు అన్నమయ్యను అతని కీర్తనలతోనే మనము సదా పూజించవలయును. ప్రతి మానవుని నోటను అన్నమాచార్య సంకీర్తనలు తాండవ మాడుచుండవలయును. ఇతోధికముగఁ బ్రచారము జరుగవలయును.

అన్నమాచార్యోత్సవములీ తిరుపతి పట్టణముననేగాక సంవత్సరమునకొక పట్టణమువంతున ఆంధ్రదేశమందలి పట్టణములన్నిటియందును జరుగుచుండవలయును. శ్రీ అన్నమాచార్యులకు మనసార మ్రొక్కి, యతని కీర్తనల వ్యాప్తి నాకాంక్షించుచు, నాకీ యవకాశమిచ్చినందులకు మరియొకసారి దేవస్థానాధికారులకు నుత్సవ నిర్వాహక వర్గమువారికిని కృతజ్ఞతను దెలుపుకొనుచు విరమించుచున్నాను.

## అనుబంధము 3

### శ్రీ కోరాడ రామకృష్ణయ్యగారి యుపన్యాసము.

అధ్యక్షా ! మహాశయులారా !

అందరకు నమోవాకములు. శ్రీ అన్నమాచార్యుని యొక్క అతని కీర్తనలయొక్కయుఁ జరితమును గతవత్సము జరిగిన యుత్సవసందర్భమున నా యుపన్యాసములోఁ గొంత వరకు మనవిచేసియున్నాను. అద్దానిని మరల నిపుడు విపులీకరించుట యనావశ్యకము. అన్నమాచార్యచరిత పరిశోధనకుఁ బితామహులనఁ దగిన, నేఁటి సభకధ్యక్షులు శ్రీ సాధు సుబ్రహ్మణ్యశాస్త్రిగారు, సంకీర్తనల ప్రచారమునకు మార్గదర్శకులయిన కీ. శే. శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారు, తన్మార్గానువర్తులయి యుత్సాహముతో నవిరళకృషిసలుపుచున్న

శ్రీ తిరుమల తిరుపతి దేవస్థానాధికారులును, ఆంధ్రుల ప్రశంసల కెల్లపుడును బాత్రులయియున్నారు.

నేఁడు అన్నమాచార్యపద సాహిత్యము నుద్దేశించి ముఖ్యముగ భాషాశాస్త్రదృష్టితోఁ గొన్ని యంశములను మనవి చేయఁ దలఁచితిని. అన్నమాచార్య కీర్తనలు కేవలము సంగీత దృష్టితోనే గాక, సాహిత్యదృష్టితోను భాషాదృష్టితోను గూడఁ బరిశోధింపఁ దగియున్నవని నాయభిప్రాయము. 'సంగీతం చైవసాహిత్యం సరస్వత్యాః కుచద్వయమ్' అనిగదా యార్యోక్తి. సంగీతమందు వలెనే సాహిత్యమందును బరిశోధనసలిపి యాంధ్ర వాఙ్మయమున నన్నమయ్య స్థానమెట్టిదో నిరూపింపవలసి యున్నది. ఈ విషయము కేవల మన్నమయ్యకే పరిమితము కానక్కఱలేదు. పదసాహిత్యమంతకును వ్యాప్తముకావచ్చును. త్యాగరాజాది పదకవులందరకును సంబంధింపవచ్చును. ఆవిధముగఁ బదకవులు — వారికవిత — దానిస్థానము — భాషాశాస్త్రజ్ఞ దృష్టి — లాక్షణికదృష్టి — మొదలగు వాని పరిశోధనకు వలసిన న్ని యేర్పాటులు జరుగవలసియున్నవి. అన్నమాచార్యుఁడు పదకవితా పితామహుఁడు కాన నతని సాహిత్యము మన విమర్శకు ప్రథమసోపానము కావలయును.

మొదటినుండియు మనసాహిత్యరంగమునఁ బదకర్తలకు, వారివాఙ్మయమునకుదగిన స్థానమున్నట్లు కనబడదు. కాని ప్రస్తుత

పరిస్థితులనుబట్టి యాంధ్రసాహిత్యమును బునర్విమర్శించి పై వారికిఁ దగిన స్థానమును నిర్ణయించకతప్పదు. ఇట్టి యుత్సాహ మిటీవల విమర్శకులలో నుదయించుచుండుట సంతసింపఁదగినది.

ఆంధ్రసాహిత్యమునఁ బ్రధానముగ రెండు పద్ధతులున్నవి. మొదటిది దేశి. రెండవది మార్గము. ఈ వ్యవహారములు మొదట సంగీత సంప్రదాయమున నుండి పిదప సాహిత్య సంప్రదాయమునకు సంక్రమించినట్లు తెలియుచున్నది. "దేశేదేశే జనానాంయః రుచ్యా హృదయరంజకః। ...... దేశీతి కథ్యతే" "యోమార్గితో విరించ్యాద్యైః మార్గస్సకిల కథ్యతే" అని వాని నిర్వచనములు. ఈ రెంటిలో దేశి సహజము సర్వజనరంజకము. మార్గము కృతకము. కతిపయజన రంజకము. దేశి అసంస్కార రమణీయము. మార్గము సంస్కార కఠినము. దేశి దేశీయులసొత్తు. మార్గము పరదేశీయులసొత్తు. దేశి ద్రావిడభాషలకుఁ బుట్టుకతోడి భూషణము. మార్గము వానికిఁ బెట్టిన తొడవు. దేశి ప్రాకృతాశ్రయము. మార్గము సంస్కృతాశ్రయము. ప్రస్తుతము దేశి విషయమునే వివరించెదను.

పై రెండు పద్ధతులకును సాహిత్యమునఁ బ్రారంభము నుండియు సంఘర్షణ సంభవించెను. అందుఁ బ్రబలాశ్రయము లేకపోవుటచే దేశి నిలువఁజాలక క్రుంగిపోయెను. సంస్కృత పండితులు మార్గ పద్ధతినే యాశ్రయించి గ్రంథముల రచించి

రాజుల మెప్పించి దేశిని నిరాధారను జేసివైచిరి. మార్గము శిఖరమెక్కెను. దేశి క్రిందఁబడెను. తెలుఁగున నిట్టివనికి సూత్రధారుఁడు నన్నయ. తనకుముందున్న దేశి సాహిత్యమును గనఁబడకుండఁ జేసి తానాదికవి యనిపించుకొనెను. నాఁటినుండి మార్గ భూయిష్ఠమగు నాతని భాషయే పరిగ్రాహ్యమయ్యెను. తెలుఁగు, తెలుఁగుఁదనము మరుఁగుపడెను. నన్నయ నాఁడే కొంతలోఁ గొంత దేశిమార్గమును ద్రొక్కిన నన్నెచోడుఁడు, 1914-వ సంవత్సర ప్రాంతమున శ్రీ మానవల్లి రామకృష్ణకవిగారు వీపుఁదట్టి వెలికిఁ దీయువరకు మార్గీయుల ధాటికాగలేక దాఁగియే యుండెను. పురాణయుగమంతయు దాదాపు మార్గపద్ధతినే నడచెను. ప్రక్కను పాల్కురికి సోమనాథాదులు కొందరు ధీరులుమాత్రము దేశిని కొంత నిలువఁబెట్టుచు వచ్చి మార్గీయులకుఁ బ్రక్కలో బల్లెములవలెఁ బనిచేయఁగలిగిరి. ముఖ్యముగ "ఆర్యాఢగద్య పద్యాది ప్రబంధ — పూరిత సంస్కృత భూయిష్ఠరచన — మానుగా సర్వసామాన్యంబుగామి — జాను తెనుఁగు ప్రసన్నము" ఇత్యాదిగఁ ప్రతిజ్ఞనుజేసి దేశిని సర్వవిధముల విహరించి నన్నయకు గట్టి దెబ్బను దీసినవాఁడు పాల్కురికి సోమన్నయే యనుటకు సందియములేదు.

ప్రబంధయుగ ప్రారంభమునాఁటికి మరల మన అన్నమయ్య దేశికిఁ బట్టుకొమ్మ అయ్యెను. దేశిపద్ధతి నపారసాహిత్య సాగరమును సృష్టించి పదకవితా పితామహుఁడు కాఁగలిగెను.

ఇంతటి పదసాహిత్య మేయితరభాషలందును లేదు. కాని యేమిలాభము? మార్గానుయాయుల దృష్టిదోషమో—శాపమో అన్నట్లు మొన్నటివరకు — అన్నమయ్య సాహిత్యము మూలనే బడియుండెను. ఇప్పటికైన బయటఁబడి దినదిన వ్యాప్తినొందు చున్నందులకు మనము సంతసింపవలసియున్నది.

మరియొక విషయము. భాషా, సంగీత, సాహిత్యము లందువలె లక్షణములందును మార్గపద్ధతియే ప్రవేశించి దేశి నణగఁద్రొక్కినది. వ్యాకరణము, ఛందస్సు, అలంకారము, అన్నిటియందును సంస్కృత ప్రాబల్య మత్యధికమై సహజమగు దేశికి స్థానమే లేకుండఁ బోయెను. శార్దూలాది వృత్తములు ద్రావిడభాషలకు సహజములు కావు. కృతకములు. రగడ, ద్విపద, త్రిపదాదులే ద్రావిడ భాషలకు సహజములు. దేశి సాహిత్యమం దెల్లెడల నివియేకనిపించును. పాటలన్నియు నించుమించు రగడభేదములే. ఇట్టి సహజసంపద, సంస్కృత ముగాలిగట్టిగా దగిలిన ఆంధ్రకర్ణాట మలయాళములలోఁ జాల వరకు నశించెను. అనేక కారణములచే సంస్కృత సంపర్క మంతగాలేని తమిళమునమాత్ర మీసంపద పూర్తిగా నిలిచి యున్నది. అది దాని భాగ్యము. తమిళసాహిత్యము నూటికిఁ దొంబదిపాళ్ళు దేశిభూయిష్ఠమే. మనదురదృష్టమేకాక దేశి సంపద మనకును నిలిచియున్నచో ఆంధ్రభాషజాతకము క్రీ॥ శ॥ 1050 తో ఆగియుండెడిది కాదు గదా! తమిళసంగవాఙ్మయము

వలె మనదేశివాఙ్మయమును జూచి యొరులకుఁ జూపించి మురియు వారము గదా!

ఇంతకుఁ జెప్పునదేమన వెనుకటి సంగతి యెట్లున్నను ప్రబంధయుగమునుండి నేఁటివరకును దేశిపద్ధతినవలంబించి మన సహజసంపదను వృద్ధినొందించినవారు పదకర్తలనునది. వారిలో నన్నమయ్య ప్రముఖుఁడు. అతని సాహిత్యమును నాఁటి భాషా సంప్రదాయములను బూర్తిగాఁ బరిశోధింపవలయును. అన్నమయ్య పదసాహిత్యములలో దేశిపద్ధతి తొణికిసలాడుచుండును. నన్నెచోడుఁడు, సోమనాథుఁడు, అన్నమాచార్యుఁడు వీరి సాహిత్యములకుఁ జాలపోలికలున్నవి. వీరుముగ్గురును దేశిసంపదకుఁ బరిపోషకులు. వీరిసంప్రదాయములను శోధించి పరస్పర సామ్యవైషమ్యములను విశదీకరింపవలసియున్నది.

అన్నమాచార్య సంకీర్తనలలోని భాష శిష్టవ్యావహారికమే యనఁదగియున్నది. లక్షణములధాటికది నిలువఁజాలదు. నిలువనక్కరలేదు కూడ. ప్రవాహినియగు దేశ్యకులక్షణశృంఖలములనేలఁ దగిలింపవలయును? 'ఏలువాఁడు', 'దీపకంబములు' 'అరుహము' మొదలగు ప్రయోగములు శాసనములలోను సోమనాథాదుల గ్రంథములలోను బెక్కులున్నవి. అన్నమాచార్యుఁడును 'వహమాని, జాజరకాఁడు, ఉపమరి, తోడుసు, చేసీని, వచ్చీని, పెట్టరంటా, ఆడుతా, మొదలగు ప్రయోగములను వేలకొలది ప్రయోగించియున్నాఁడు. తేటతెలుఁగున,

తుమ్మెదపదములు, గొబ్బిళ్ళు, అల్లోనేరేళ్ళు, సువ్విపాటలు మొదలగు పదములను కొన్నివేలు రచించినాఁడు. ఆపాటల నన్నింటిని దేశిసంగీతమునఁ బాడుటయే సర్వోత్తమమని నా తాత్పర్యము. దేశిపాటలకు దేశిసంగీతమే యుక్తముగదా! ఏ విధముగఁ జూచినను దేశికిఁ బెన్నిధి అన్నమయ్య. కాన నతని సాహిత్యమును బరిశీలించి పరిపరివిధముల బాటలు వేయక తీరదు.

నేఁటి తెలుఁగుయొక్కస్థితి చిత్రముగ నున్నది. వ్యావహారికవాద మొకవంక గ్రాంథికవాద మింకొకవంక. సినీమా, రేడియో, పత్రికలు, మొదలగు ప్రచారసాధనములలో వ్యావహారికమే రాజ్యమేలుచున్నది. కాని లాక్షణికుల యాదరము నది పొందలేకున్నది. ఈస్థితిలోఁ దాటస్థ్యము విజ్ఞులకు, విమర్శకులకును యుక్తముగాదు. సభల జరిపి పరిషత్తుల నేర్పరచి పరస్పర సమన్వయమునకు దారిఁ జూపవలయును. అద్దాని కన్నమాచార్యసాహిత్యపరిశోధన మిక్కిలి యుపయోగించుననని నా యాశయము. పదసాహిత్యమును బూర్తిగ శోధించినచో దేశిస్వరూపము, వ్యావహారికరీతులు, భాషాపరిణామములు, భ్రాంతియువాసనలు, మొదలగునవన్నియు బయటఁబడి యొక యొడ్డుకు మనలను జేర్చవచ్చును. వాస్తవముగ, శిష్టులన నెట్టివారు శిష్టవ్యావహారిక స్వరూపమేది ? లక్షణములనెప్పుడెట్లు మార్చుచుండవలయును ? మొదలగు ప్రశ్నల కెప్పుడు సరియైన సమాధానము

నిచ్చుట దుర్ఘటమే అయినను, నేను చెప్పిన రీతిని పరిశోధన జరిగి నన్నయభారతమంతటి గ్రంథము వ్యావహారికమున బయలు దేరినపుడు, వ్యావహారికమునకుఁ బ్రామాణ్యమువచ్చి సర్వా దరణీయమగు నొకదారి దొరుకక పోదని మనము విశ్వసింప నగును. జీవద్భాషకు మార్పుసహజము. తదనుసారము లక్షణ ములును మారుచుండవలసినదే. అయిన నట్టిపని పండితపరిషత్తుల మూలమున జరుగుట మంచిది. దానికిఁ బండితులందరు నభిని వేశములను విడిచి ముందుకు రావలయును. మరియు నన్నమా చార్య శబ్దజాలమున కొకనిఘంటువు సిద్ధముకావలయును. దేశి రీతులబోధించుట కొక గ్రంథము వేరుగ రచింపఁబడవలయును. ఇట్టి ప్రసంగమువలన మార్గపద్ధతి సర్వథా విడువఁదగినదని నా యభిసంధి యనుకొనవలదు. అదియు నవలంబనీయమే. కాని దానితో సమముగ దేశిని గూడ నాదరించవలయుననునదే నా ప్రార్థన.

దేశిపరిశోధన సంతృప్తికరముగ జరుగుగాక! దేశిసాహి త్యము పునరుద్ధరింపఁ బడుగాక! అన్నమయ్య ఆంధ్రసాహిత్యా కాశమున ధ్రువతారయై వెలుఁగు గాక! మనకృషికి శ్రీవేంక టేశ్వరుఁడు తోడ్పడు గాక!

ఈ యవకాశము నాకిచ్చినందులకు దేవస్థానాధికారులకు మా పరిశోధనాలయకులపతులకును కృతజ్ఞతను వెల్లడించుచు నింతతో ముగించుచున్నాను.

# అనుబంధము 4.

అధ్యక్షోపన్యాసము :— శ్రీసాధు సుబ్రహ్మణ్యశాస్త్రిగారు.

పండితవర్యులారా ! సభ్యులారా !

అర్హుఁడను గాకున్నను నేఁటి సభకు నన్నధ్యక్షునిగ వరించుట మిక్కిలి మనస్సంకోచమును గలిగించుచున్నది. అయినను బెద్దలకోరికయగుట నంగీకరించక తప్పినదికాదు. ఈయుత్సవ నిర్వాహకబృందమునకు ఎంతయుఁ గృతజ్ఞుఁడను.

నాకు భాషాపరిశోధనయేమియుఁ దెలియదు. దానికిఁ దగినపాండిత్యమును నాకులేదు. ఏదో చిన్నతనమునుండియు నుండు నుత్సాహముతో నీ దేవస్థానమున నుద్యోగిగ నుండినపుడు, విశ్రాంతినిగైకొనినపిదపఁ గూడ నన్నమాచార్య విషయకమగు చరితమును బరిశోధించినాను. ఆ చరితపరిశోధనకుఁ బితామహుఁడని శ్రీ రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మగారు నన్ను స్తుతించినారు. ఆ బిరుదమునకు నేను తగినవాఁడను గాను. నేను చేసినపని యత్యల్పము. నాపరిశోధనము, తత్ఫలితములు, మొదలగు విషయములతో నొక పొత్తమును రచించి మొదటి యన్నమాచార్యోత్సవమునఁ బ్రకటించియుంటిని. తిరుమల యందలి తాళ్ళపాకవారి యరను శోధించుట, రాగిరేకులను బయటఁ బెట్టుట, ఆ రేకులలో మూఁడు నాల్గింటిపై నన్నమయ్య వ్రాసిన చిన్నలక్షణ గ్రంథముండ నద్దానిని శ్రీజయంతి రామయ్య

పంతులుగారికిఁ జూపి వారిమూలమున నాంధ్రసాహిత్యపరిష త్పత్రికయందుఁ బ్రకటించుట, మొదలగు చిన్నచిన్న ప్రారంభ కృత్యములే నా వలన జరిగినవి. తరువాత నత్యుత్సాహముతో వివిధప్రయత్నముల సలిపి యన్నమయ్యను నతని సాహిత్యమును ఈ మాత్రము స్థితికిఁ దీసికొని వచ్చిన మహాశయులు కీ॥ శే॥ వేటూరి ప్రభాకరశాస్త్రులుగారు. ఇంకను శ్రీ రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మగారి వలన నితోధిక ప్రచారాదికము జరుగవలసి యున్నది. తప్పక జరుగునను నమ్మకము నాకు గలదు.

చారిత్రకులు ఆంధ్రవాఙ్మయచరితమును రచించు సమ యమునకు, అన్నమాచార్యచరితము నతని సాహిత్యమును బయటఁ బడలేదు. వాని విషయమున నూహలుమాత్రమే యాధారములయ్యెను. కావుననే శ్రీ కందుకూరి వీరేశలింగము పంతులుగారు మొదట వ్రాసిన కవుల చరిత్రలో అన్నమాచార్య ప్రసంగమునఁ దాతను మనుమనిగ మనుమనిఁ దాతగును నిరూ పించు ప్రమాదము గూడ సంభవించెను. నా పరిశోధనవలన సత్యము గుర్తింపఁబడెను. ఇట్టి స్వల్పవిషయములే నా పరి శోధనా ఫలితములు.

అన్నమాచార్యు నెంతఁబొగడినను జాలదనియే యని పించును. అతఁడు భక్తాగ్రగణ్యుఁడు. 104 సంవత్సరములతఁడు జీవించినట్లు నానమ్మకము. తన 16 వ యేటనుండి ప్రారంభించి జీవితాంతము వరకు శ్రీనివాససేవను జేసెను. దినమున కొక

సంకీర్తనమును వ్రాసి ధన్యుఁడయ్యెను. తనయవసాన సమయమునఁగుమారుఁడగు పెదతిరుమలాచార్యునితోఁ గూడఁ దాను రచించినట్లే కీర్తనల రచింపుమని చెప్పెను. ఈ యంశము శాసనములలోనే స్పష్టముగ నున్నది. ఎంతటి భగవత్సేవయో ఆలోచింపుఁడు.

అన్నమాచార్యుని తరువాత నతని వంశమువారు చిరకాలము శ్రీనివాసునిసేవించుచు వచ్చిరి. అన్నమాచార్యుని మనుమఁడు చంద్రగిరివద్ద మంగాపురములో నొక కోవెలనిర్మించి యచట శ్రీనివాసు నారాధించుచుండెనట. క్రమముగ నాలుగైదు తరములయిన పిదప నావంశమువారు ఇటునటు చెదరిపోయినట్లు కనఁబడును. తరువాతివారిపేరులలోను, చరిత్రములోను సందేహములేగాని నిశ్చయములు తెలియుట కాధారములు లేవు. నేఁడీ సభనలంకరించియున్న శ్రీతాళ్ళపాక సూర్యనారాయణయ్యగారు అన్నమాచార్యవంశము వారే.

భాషాసాహిత్యముల విషయము నాకంతగఁ దెలియదని మొదటనే చెప్పియున్నాను. అందు శ్రీ కోరాడ రామకృష్ణయ్యగారి యాశయములలో నే నేకీభవించుచున్నాను. పరిశోధకులు, పండితులును విశేషముగఁ బ్రయత్నించి నన్నయకుఁ బూర్వము తెలుఁగు యొక్క స్థితిగతులు, పరిణామములు నెట్లుండెడివో లోకమున విశదపరచఁదగునని మనవి చేయుచున్నాను.

అన్నమాచార్య సంగీతసాహిత్యములకిటోఁధిక ప్రచార మునకై చేయఁదగు కృత్యముల విషయమున నాకుఁదోఁచిన కొన్ని యభిప్రాయములను సహృదయుల యెదుట వివరించు చున్నాను.

(1) అన్నమాచార్యుని పేరుతో నీ తిరుపతి యందొక సంగీతకలాశాల యుండవలెను. శ్రీ రాళ్లపల్లి అనంతకృష్ణశర్మ గారు దానికిఁ బ్రధానాచార్యులుగా నుండవలయును. అందు ముఖ్యముగ నన్నమాచార్య సంకీర్తనలనే యభ్యసింపఁజేయ వలయును. ఎవరికిఁదోఁచినట్లు వారు పాడుట నాకు నచ్చలేదు. అట్లభ్యసించి యుత్తీర్ణులయిన వారిని బ్రచారమునకై పెక్కు తావులకుఁ బంపుచుండవలయును.

(2) ప్రఖ్యాత కర్ణాటభక్తుఁడు పురందరదాసు అన్నమా చార్య సమకాలికుఁడు. అతఁడొనాఁడు తిరుమలకు వచ్చి అన్నమయ్యను దర్శించి వెళ్లినట్లు చారిత్రకసాక్ష్యములు గలవు. పురందరదాసు గూడ వందలకొలది కీర్తనలను రచించినాఁడు. వీరిరువురి కీర్తనలను బాగుగఁ బరిశోధింపవలయును. ధోరణుల లోని సామ్యవైషమ్యములను గుర్తింపవలయును. ఈ పని భాషకు సంగీతసంప్రదాయమునకును మిక్కిలి యుపయుక్తము కాఁగలదు.

(3) త్యాగరాజకీర్తనలు సార్వజనీనములయినవి. అట్లగుటకు శిష్యవర్గము, మదరాసు సంగీతసభలు మొదలయినవి

ప్రముఖసాధనములయ్యెననుటలో సంశయములేదు. అన్నమయ్య కీర్తనల కా భాగ్యము కలుగవలసియున్నది. గతమును దడవిన నతని శిష్యవర్గమేమయినదో — ఏలనెట్లు విచ్ఛిన్నమయ్యెనో — యిన్నటి వరకుఁ గీర్తనలెందుకు దాగియుండినవో — చెప్పఁజాల కున్నాము. పోనిండు. గతమును మరచిపోవుదము. ప్రకృతము ప్రత్యేకముగ నన్నమయ్యకుఁ బరంపరా శిష్యబృందము సిద్ధము కావలయును. అన్నమయ్య సంకీర్తనల గానముచేయు సంగీత సభలు బహుముఖములుగ జరుగవలయును.

(4) అన్నమాచార్యుని దౌహిత్రుడు రేవణూరి వేంక టార్యుడు తన శ్రీపాదరేణుమాహాత్మ్య గ్రంథములో నన్న మయ్యకు "ద్రావిడాగమ సార్వభౌమ" అను బిరుదునుప యోగించెను. అది అసత్యమై యుండదు. ద్రావిడ దివ్య ప్రబంధములలోని విషయముల నాతఁడు తన కీర్తనలలోఁ జొని పెనేమో! కాన ద్రావిడ ప్రబంధములను అన్నమయ్య కీర్తనలను ఒక దగ్గరఁబెట్టి పరిశోధింపవలయును. పెక్కురహస్యములా పనివలనఁ దెలియవచ్చును. ద్రావిడ ప్రబంధముల ఆంధ్రీ కరణమువలనఁగాని, ఉభయభాషాప్రవీణులు నొకచోఁజేరుట వలనఁగాని, యట్టిపని సుకరమగుననుట విశదమే గదా!

(5) శ్రీ కోరాడ రామకృష్ణయ్యగారు చెప్పినట్లు ప్రత్యే కముగ నన్నమాచార్యుని భాషను శోధించి తేటతెలుఁగు మర్మ ములను విపులముగఁ బ్రకటింపవలయును.

పై కార్యము లన్నియు శ్రీ వేంకటేశ్వరుని కృపవలన నతి శీఘ్రముగ నిర్వర్తింపఁబడుగాక యని ప్రార్థించుచుఁ బ్రసంగమును ముగించుచున్నాఁడను.

---

## అనుబంధము 5

### శ్రీ అయాచితుల హనుమచ్ఛాస్త్రిగారి యుపన్యాసము.

ఆర్యమహాశయులకు వందనములు.

అల్పజ్ఞుఁడనగు నన్నుఁ గూడ నీ యన్నమాచార్యోత్సవమున నొక యుపన్యాసకునిగ నుండవలసినదిగ శ్రీ వేంకటేశ్వర ప్రాచ్యపరిశోధనాలయకులపతులు శ్రీ పరవస్తు వేంకటరామానుజస్వామిగా రాదేశించినారు. స్వరూప జ్ఞానమున్నను బితృతుల్యుల యాదేశముగాన నెదురాడ వీలయినది గాదు. సుగృహీతనామధేయులు, బహుశాస్త్రవిశారదులునగు, శ్రీరాళ్ళపల్లి అనంతకృష్ణశర్మగారి యాధ్యక్ష్యమున ఏవో కొన్ని మాటలాడ నవకాశముగలుగుట నా భాగ్యమే. నాకిక భయమక్కఱలేదు. దోసఁగులన్నియుఁ బెద్దలే సవరించుకొనఁగలరు.

అన్నమాచార్యుఁడు మఱఁగు పడిన యనర్ఘరత్నము. అద్దానిని బయటకుఁ దీసినవారు కీ. శే. శ్రీ వేటూరి ప్రభాకర శాస్త్రులుగారు. నాఁటినుండి యా రత్నము విలువను అనేకు లనేకరీతులలో నిరూపించుచున్నారు. అవియే నేఁటివరకుఁ

బలువురు ప్రముఖులు అతిగంభీరముగ నిచ్చిన యుపన్యాసములు. వానిని దడవుటయనావశ్యకము. నేఁడు ముఖ్యముగ "తత్త్వము సాహిత్యసుషమ" అను రెండు దృష్టులతో నాకుఁ దోఁచిన రీతిని నేనును అన్నమార్య మణియొక్క విలువనుగట్టఁ బ్రయత్నించెదను.

అన్నమాచార్యుఁడు భక్తియోగి. భక్తి దాక్షిణాత్యుల సొత్తు. దానిని గ్రమముగ నౌత్తరాహులును బంచుకొనినారు. మొట్టమొదట భక్తిప్రసంగములు దక్షిణదేశముననే తామ్రపర్ణీ నదీతీరమున జరిగినట్లు భాగవతములో, శ్వేతాశ్వతరోపనిషత్తులోను నిదర్శనములున్నవని ప్రఖ్యాత పరిశోధకులు భండార్కరు గారొకచో వ్రాసియున్నారు. తైలధారావదవిచ్ఛిన్న స్మృతి సంతానరూపాపన్న జ్ఞానము భక్తియని పెద్దల నిర్వచనము. అట్టి భక్తిగలవారిలో నగ్రగణ్యులు దాక్షిణాత్యులే. పన్నిద్దరాళ్వారు లెక్కడివారు? వారివలననే గదా భక్తియోగము పరాకాష్ఠను జెంది సకలదేశవ్యాప్తమైనది! అట్టి యాళ్వారుల శ్రేణికిఁ జెందిన వాఁడే మన అన్నమయ్య. తెలుఁగునాఁటి మొదటి యాళ్వారు. దివ్యప్రబంధములను రచించినట్లే యితఁడు దివ్యసంకీర్తనల రచించినాఁడు. భక్తమణి యైనాఁడు. ఉత్తరదేశభక్తవరులగు సూరదాస వల్లభాచార్యాదులకును బూర్వుఁడితఁడు కాఁగా శ్రీ వేంకటేశపరముగనిన్ని కీర్తనలరచించి పాడి ధన్యజీవియైన అన్నమయ్య తత్త్వము భక్తిగాక యింక నేమగును?

శ్రవణకీర్తనాదులచే భక్తి తొమ్మిది విధములని చెప్పఁబడియున్నది. అన్ని విధముల భక్తిమార్గములను సంచరించిన వాఁడే అన్నమయ్య. అందును దాస్య భక్తి యితనికత్యభిమతమని తెలియును. ఇట్టి యంశములకన్నిటికి నితని కీర్తనలే ప్రబలాధారములు. ప్రతియొక యంశమునకు నొక్కొక కీర్తనను బట్టి సాక్ష్యమును జూపవచ్చును. అట్లు చేసిన నతివిస్తరమగును గానఁ గొన్నిటిని మాత్రముదాహరించెదను. దాస్యభక్తికి నైచ్యానుసంధానము ముఖ్యము గదా! "జాలే కూళలలో కూళను" ఇత్యాది కీర్తనలితని నైచ్యానుసంధానమునకు నిదర్శనములు. నారాయణమంత్రము నితఁడు పెక్కు కీర్తనలతో జపించియున్నాఁడు. దాన నితని కీర్తనభక్తి విశదమగును. నామ సంకీర్తనము నధికముగ నవలంబించిన వారు నామదేవ్, తుకారామ్ మొదలగువారు. తత్సదృశుఁడే అన్నమాచార్యుఁడును. "నేనే పో ఘనుఁడను, మొదలగు సంకీర్తనలచే నితని చిత్రమైన మనస్తత్త్వము" ఇదిగో శ్రుతిమూలము, ఇత్యాది కీర్తనలచే నితని బహుసంప్రదాయ వేత్తృత్వమును బ్రకటమగును. ఒకచో భగవంతుని దిక్కులేని వానిగ నిరూపించును. వేరొకచో నందరకు దిక్కతఁడే యనును. ఇంకొకచో భగవానునికిఁ బూజ యెందులకనును. మరియొకచోఁ బూజతప్పదనును. ఒకవంక వర్ణాశ్రమధర్మముల నీసడించును. వేరొక వంక నవియే ధర్మమూలములనును. ఇట్టి వానిచే నితని స్థిత

ప్రజ్ఞత్వము, నిష్కామకర్మయోగిత్వము, అనన్యభక్తి, అకలంక జ్ఞానము మున్నగునవి ప్రకటములగుచుండును. వాస్తవముగ గీతయందుఁ జెప్పిన చొప్పున 'సర్వత్రసమదర్శి, యగుపండితుఁ డన్నమయ్యయనుటకంటె నధికముగ మాదృశులాతని తత్త్వము నెంచ జాలరు.

తుదకు భక్తియోగ పరమరహస్యమగు ప్రపత్తియోగము నందుకొని "సర్వధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ" అను శ్రీనివాసుని మాటను స్మరించుచు, "పాపోఽహం పాప కర్మాహమ్......... అన్యథా శరణం నాస్తి త్వమేవ శరణం మమ" అని చేతులెత్తి భగవంతుని శరణు బొంది ప్రపన్న శిఖామణియై అన్నమాచార్యుఁడు తరించెనని చెప్పుటకు సందియములేదు. "కొసరి కొసరి శరణనుటే చాలు" మొదలగు శరణాగతి సంకీర్తనలెన్నియో ఇతని ముఖమున వెలువడి యున్నవి.

కాఁగా అన్నమయ్య విరాగి, భక్తుఁడు, ప్రపన్నుఁడు, పరమవైష్ణవుఁడు, దివ్యసూరివరుఁడు ననుట నాతాత్పర్యము. అతని పరదైవము శ్రీమహావిష్ణువని, అతని సాధనములు భక్తి ప్రపత్తులనియును వేరుగఁ జెప్పవలయునా ?

ఇఁక నన్నమయ్య సాహిత్యసుషమను గూర్చి రెండు మాటలఁజెప్పెదను. అపారమైన దేశిసాహిత్యమును సృజించిన వాఁడితఁడు. మార్గకవితాప్రాబల్యముచే నితని సాహిత్య

మింతవరకు మఱుఁగుపడినది. కాని యితని సాహిత్యములోని వైశిష్ట్యము, గాంభీర్యము, వైశాల్యము, ఉదాత్తతయునే యితర దేశభాషాసాహిత్యములందును గనరావు. పదసాహిత్య మునకుఁ బుట్టిల్లు ఉత్తర దేశము. సూరదాసు, తులసీదాసు మొదలగు ప్రఖ్యాతులందరు నటుఁ బదకర్తలే. అట్టివారు అయి దారువేల పదములను రచించినంతనే వారి నౌత్తరాహులు శిఖరములపైఁ గూర్చుండఁ బెట్టిరి. అన్నమయ్య ముప్పదివేల కీర్తనలను రచించినను నేటివర కతని గొప్పదనమును మనము గుర్తింపలేక పోయినాము. పోనిండు. ఇప్పటికైన మేలు కొను చున్నాము. అదియేచాలు. దేశినాదరించి మార్గసాహిత్యముతోఁ బాటు పదసాహిత్యవైశిష్ట్యమును గుర్తించి పదకవితాపితా మహుఁడగు నన్నమయ్య కీర్తిని దశదిశల విరజిమ్ముభారము మనపైనున్నది.

అన్నమయ్య వేదాంతము నెఱుఁగుట కతని యధ్యాత్మ సంకీర్తనలెట్లు సాధనములో, యట్లే యతని సాహిత్యమాధు ర్యమును గ్రోలుట కతని శృంగారసంకీర్తనలు ప్రబలసాధనములు. వానిని బరిశీలించిన నతని విశిష్టస్థానమెంతటిదో తెలియఁగలదు. హిందీలో విద్యాపతి శృంగార పదములున్నవి. తెలుఁగున నంతకంటె గొప్పగ అన్నమయ్య శృంగార పదములున్నవి. రెండిటిని దులనాత్మకముగఁ బరిశోధించి యన్నమయ్య గొప్పదనమును బైటఁ బెట్టఁదగును. శృంగారసంకీర్తనలలోని

నాయికావర్ణనము, సౌందర్యవర్ణనము, ఉద్దీపనవిభావాది వర్ణనము, ఋతువర్ణనము, శృంగారవర్ణనము ననితర సాధారణములు. ప్రబంధకవుల శృంగారమునకు, అన్నమయ్య శృంగారమునకును హాస్తిమశకాంతరమున్నది. అన్నమయ్యకు లక్ష్మీనారాయణులే నాయికానాయకులు. అతని శృంగారమౌచిత్యభూయిష్ఠము. ప్రబంధములందు నాయికా నాయకులు సామాన్యమానవాదులగుట శృంగారమనౌచిత్య భూయిష్ఠముగ నుండుటయుఁ దరచుగఁ గనఁబడు చుండును గదా !

మహాభక్తునికి శృంగారప్రసక్తియేమి ? అనియడుగ వచ్చును. అది ఐహికశృంగారము గాదు. ఆధ్యాత్మికశృంగారము మధురభక్తి పద్ధతియది. ఉత్తరహిందుస్థాన మంతయు నీ మధురభక్తిచేతనే యాప్లావితమయ్యెను. దక్షిణదేశమున నిట్టి సంప్రదాయమున కన్నమయ్యయే మార్గదర్శకుఁడన వచ్చును. క్షేత్రయ్య, శార్ఙ్గపాణి, త్యాగయ్య మొదలగు వారేతన్మార్గానువర్తులే గదా !

తెలుఁగునుడికారపుసొంపునకు అన్నమయ్య శృంగార సంకీర్తనలు భాండాగారములు. తేటతెలుఁగునకవి నిధులు. జాను తెనుఁగునకవిరాజమార్గములు. పదములలో నింతటిసౌందర్యము, దేశీయత, ఔచిత్యము నెచ్చటను గానరావు. పదసాహిత్యము నకుఁ బరమగౌరవమును సంపాదించి పెట్టినవాఁ డన్నమాచార్యుడే.

మరియొక చిత్రము. సాధారణముగఁ బదకర్తలందరుఁ దమ పదములను స్వనామముద్రాంకితములుగఁ జేసిరి. కాని అన్నమయ్య యన్ని పదములను శ్రీవేంకటేశాంకితముగ నొనర్చెను. ఎంతటి త్యాగమో చూడుఁడు. నిష్కామకర్మయోగమున కింతకన్న నేమి నిదర్శనము కావలయును ?

కాఁగా దేశీయత, ఔచిత్యము, ఉదాత్తత, మొదలగు మహాగుణములతో నన్నమయ్య సాహిత్య మొప్పుచున్నదని, యతనికి సాహిత్యరంగమునఁ గూడ నుచితమగు స్థానము నీయవలసిన భారము తెలుగు వారిపై నున్నదనియు మనవి.

సంగీత విషయము లేశమాత్రమైన నాకుఁ దెలియనందునఁ బై రెండు విషయములనే మనవి చేసియున్నాను. సంగీత సాహిత్యాది వివిధదృష్టులతో నన్నమాచార్యుని సాహిత్యము సంపూర్ణముగఁ బరిశోధింపఁబడి దేశవ్యాప్తమగు గాక ! నాకీ యవకాశము నిచ్చినందులకుఁ బెద్దలందరకు నభివందనములఁ జేయుచు విరమించుచున్నాఁడను.

# అనుబంధము 6

అధ్యక్షోపన్యాసము :— **శ్రీ రాళ్ళపల్లి** అనంతకృష్ణశర్మగారు

సభ్యమహాజనులకు నమోవాకములు

అన్నమాచార్యుని గురించి ప్రముఖులు ప్రశస్తముగ నుపన్యసించుచున్నారు. ఈ విధముగ మాకోరికలు సఫలమగుచున్నందున నాకమితానందము గల్గుచున్నది. అన్నమయ్యను మొదటఁ బ్రజలదృష్టికిఁ దెచ్చినవారు శ్రీ సాధు సుబ్రహ్మణ్యశాస్త్రిగారు. బహుముఖములుగ నాతని వ్యాపింపఁజేయనుత్సహించి కార్యములకు రూపురేఖలు దిద్దినవారు కీ. శే. శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారు. పిదప యథాశక్తిగ నావనులఁ గొనసాగింప మిక్కిలియుత్సాహముగలవాఁడను నేను. మాకందరకు సధ్యక్షులు శ్రీ పరవస్తు వేంకటరామానుజస్వామిగారు. భగవత్కృపయున్నచోఁ బెద్దలు సూచించినయన్ని రీతులలోను గృషిచేసి యన్నమయ్య నారాధించుచునుండఁ గలనని మనవి చేయుచున్నాను. మా వాంఛితభవనముల కన్నిటికి మూలస్తంభములు శ్రీ దేవస్థానాధికారులు. వారు మాకు సమధిక సహాయముచేయుచున్నందులకు సదా కృతజ్ఞులము.

అన్నమయ్య సంగీతపరిచారమునకు మొదట సంగీతసభ లేర్పరచఁబడినవి. పిదపఁ గేవలము సంగీతమే గాక సాహి

త్యము గూడ విమర్శింపఁబడ వలయునను నుద్దేశముతో నిరిటి నుండియు నుదయవేళల సాహిత్యసభలు గూడఁ బ్రారంభింపఁ బడినవి. అవిచ్ఛిన్నముగ సాగుచుండుట మాయదృష్టము. ఈ సభలలోఁ బాల్గొని తమయమూల్యవాగమృతమును బంచి పెట్టు సహృదయులకు వందనములను దప్ప మేమేమి సమర్పించఁ గలము!

నేఁటి యుపన్యాసకులు శ్రీ హనుమచ్ఛాస్త్రిగారు నాలుగుభాషలలో (తెలుఁగు, సంస్కృతము, హిందీ, ఆంగ్లము) పండితులు కావుననే వారిని మేముపన్యసింపఁగోరితిమి. అన్ని భాషలవారును అన్నమయ్య సాహిత్యమును శోధించవలయునను నది మాయభిలాష. మాయభిలాషను శ్రీ శాస్త్రిగారు తీర్చిరి. మృదుమధురముగ నన్నమయ్య వైశిష్ట్యమునుగ్గడించిరి. ఇంకను ముఖ్యముగ హిందీ సాహిత్యమును అన్నమయ్య సాహిత్యమును బరిశోధించి రహస్యములను బ్రకటింపఁదగినవారు. వారు తప్పక యాపనిని జేయవలసినదిగ వారిని బ్రార్థించుచున్నాను.

అన్నమయ్యను గూర్చి యతని సాహిత్యమును గూర్చి యుఁగొన్ని మాటలను జెప్పఁదలఁచియున్నాను. తెలుఁగులో నింతటి సాహిత్యమును సృజించిన వాఁడన్నమయ్య యొకఁడే. నేఁటి వరకు నే యొకకవియు నింతసాహిత్యమును సృజింపలేదు. గ్రంథము లెక్కను చూచినచో (32 అక్షరములొక గ్రంథము) ఇంచుమించు ఒకకీర్తన 10 గ్రంథములగును. ఒక కీర్తన పది

గ్రంథములయినపుడు ముప్పదివేల కీర్తన లెన్ని గ్రంథములగునో యోచింపుడు. అన్నమయ్య వ్యాసునంత పనిచేసినవాఁడన్న మాట. మానవమాత్రుఁడెవఁడింత పనిచేయఁగలుగునను నాశ్చర్యము కలుగును గదా !

శ్రీ కోరాడ రామకృష్ణయ్యగారు భాషాశాస్త్రదృష్టితో నన్నమయ్య సాహిత్యమును గూర్చి యుపన్యసించిరి. శ్రీ అయాచితుల హనుమచ్ఛాస్త్రిగారు భావదృష్టితో నుపన్యసించిరి. వివిధదృష్టులు మనకవసరమే కాని — చిత్రము—ఆధ్యాత్మికము, శృంగారము, మొదలగు శ్రేణికిని జెందని సంకీర్తనలు చాల నున్నవి. కొన్ని కీర్తనలలో సాంకర్యము గూడ నగపడును. ఒక్క యుదాహరణమును జూపెదను. మంగతాయారు సౌందర్యము నన్నమయ్య కనులారఁజూచెను. పొంగెను. అతనికేమి యుఁదోఁచలేదు. అతని వశముననున్నది వాక్కే గదా! వెంటనే యొక సంకీర్తనమును బాడెను. "చక్కని తల్లికి చాంగుభళా" ఇత్యాది సంకీర్తనమది. అది యాధ్యాత్మికముగాదు. శృంగారమునుగాదు. విలక్షణమైన మాతృసౌందర్యానుభూతి. అనిర్వాచనీయమయిన యట్టి సమాధిస్థితిలో అన్నమయ్య పెక్కు కీర్తనలను రచించెననవచ్చును. ఆ కీర్తనల శ్రేణిభేదమును నిర్ణయించుట కష్టము.

పదకవితాపితామహుఁ డన్నమాచార్యుఁడు. ఈ బిరుదము నతని మనుమండే యిచ్చెను. అన్నమయ్య పదసాహి

త్యము సర్వోత్కృష్టము. అతని శృంగారసంకీర్తనలు, అధ్యాత్మసంకీర్తనలును నిరుపమానములు. కావుననే యా బిరుదతనికిఁ దగియున్నది. అన్నమయ్య తరువాత దాదాపు అయిదువందల యేండ్ల పదసాహిత్యచరితమును స్థూలముగఁ బరిశీలించిన మొదల నీయంశము, క్రమముగఁ బదసాహిత్యము నికృష్టస్థితిని జెందెనను నంశమును సులభముగనే గ్రహింపఁ గలుగుదుము. విజయనగర సామ్రాజ్యానంతరము మధుర, తంజావూరులలోఁ బదసాహిత్యము విపరీతముగ నభివృద్ధిఁ బొందెను. క్షేత్రయ్య పదములు మొదలగునవన్నియు నీ జాతిలోనివే కాని యవి యన్నియు ప్రభువులయధీనమునఁ దత్పరముగ బయలుదేరినవి. నీచశృంగార భూయిష్ఠములయిపోయినవి. అంతవరకు సంగీత సంప్రదాయము మాత్రము నశింపలేదు. తుదకు సారంగపాణి పదములతో నీచశృంగారమునకే ప్రధానస్థానము వచ్చెను. సంగీత సంప్రదాయమును నశించిపోయెను. సంగీతమున హిందుస్థానీ సంప్రదాయ విప్లవము వచ్చెను. జావళీలు మొదలగు వివిధపద్ధతులు బయలుదేరినవి. దీనివలన తరువాత శృంగారసంకీర్తనలస్థితి దిగజారిపోయెననుట విదితమే గదా! అన్నమయ్య శృంగారము మాత్రము భగవత్పరము. ప్రభువుల నాతఁడు లక్ష్యముచేయలేదు. ఉదాత్తత, ఔచిత్యము, నతని శృంగారకీర్తనలకు భూషణములు. సంగీతసంప్రదాయము నాతఁడుల్లంఘింపలేదు. కాన నతని శృంగారసంకీర్తనలు నిరుపమానములే. అధ్యాత్మ

సంకీర్తనల విషయము గూడ నిట్టిదే. రామదాస, కృష్ణమాచార్య త్యాగరాజాదుల యధ్యాత్మసంకీర్తనల వైశిష్ట్యముకన్న అన్నమయ్య అధ్యాత్మసంకీర్తనల వైశిష్ట్యము మిన్నయని నా విశ్వాసము.

మొత్తముపైని అన్నమయ్య తరువాత నధ్యాత్మ సంకీర్తనల సంఖ్యతగ్గినది. శృంగారసంకీర్తనల సంఖ్య విపరీతముగఁ బెరిగినది. ఈ స్థితివాంఛనీయము కాదు. రెండుపద్ధతులు నుండవలయును. ఆ విధముగ రెండుపద్ధతులను సమముగ నాదరించినవాఁడు మన అన్నమాచార్యుఁడు. అతని కాదర్శప్రాయులు ఆళ్వారులు. అట్లని కేవలము ద్రావిడ ప్రబంధముల నాతఁడు భాషాంతరీకరించలేదు. సర్వ స్వతంత్రముగా సర్వోదాత్తముగాఁ గీర్తనల రచించెను.

ఇతర దేశభాషలలో కన్న తెలుఁగునఁ బదసాహిత్య మత్యధికము. అన్నమయ్య సాహిత్యము నొక ప్రక్కనుంచినను ఒక్క తంజావూరిలోనే లక్షలకొలదిపదములు బయలుదేరినవి. కాని అన్నియు దొరుకలేదు. చాలవరకు నశించిపోయినవి. సంగీతకళారహస్యనిధి రామరాజభూషణుఁడు ఎన్నియో కృతులను రచించియుండును. ఒక్కటియు లభ్యము కాలేదు. అన్నమయ్య పదములే, పూర్తిగలభింపలేము గదా! అట్లే ఎన్నియో కాలగర్భమున నణఁగిపోయియుండును. అయినను

ఉపలబ్ధమైన సాహిత్యమే కొండంతయున్నది. దానినయిన సక్రమముగ సంరక్షించుకొన్ననదియే పదివేలు.

ఏ విధముగాఁ జూచినను అందరు నన్నమాచార్య కీర్తనల నాదరింపవలయును. ఆదరింపక పోయినచో నా యనాదరమే మన కొకశిక్షయని నాయాశయము. ఒక ప్రాకృతకవి యిట్లేయనెను :— "గాథానాం గేయానాంచ తంత్రీశబ్దానాం ప్రౌఢానాం చ యే రసం న జానంతి। తేషాం స ఏవ దండః...... యత్తద్రసాజ్ఞానమ్॥" అని.

సంగీత విషయమున నొకమాట. అన్నమయ్యనాఁటి సంగీతసంప్రదాయ మెట్టిదియో మనకుఁ దెలియదు. అతఁడెట్లు పాడెనో మనము చెప్పలేము. అనాద్యనంతమగు కాలము బహువిధపరిణామములను గలుగఁజేయుచునే యుండును గదా! ప్రాచీనరాగములు కొన్ని నశించినట్లు, కొన్ని రూపాంతరములను గొన్ని నామాంతరములను బొందినట్లును, మనకనేక నిదర్శనము లున్నవి. నవీనరాగములు కొన్నిబయలుదేరినవి. బయలు దేరనున్నవి. ప్రకృతము సంగీతసాంకర్యమే గోచరించుచున్నది. కొద్దికాలములో నొక విచిత్రమైన సంగీతవిప్లవమే వచ్చునేమో అనిపించుచున్నది. ఇట్టి మార్పులు అసహజములు కావు. కావున సంగీత విషయమునఁ గఠిన నియమములుండ నక్కర లేదని, మనకర్ణాటక సంప్రదాయమును సాధ్యమైనంతవరకు

సంరక్షించుకొనుచు నెవరికిష్టమైన రీతిని వారన్నమయ్య కీర్తనలను బాడనగుననియు నా మనవి. ప్రచారాభివృద్ధికిఁ గూడ నీ పద్ధతి కడునుపయుక్తము.

అన్నమాచార్య సంకీర్తనల ప్రచారాది కార్యక్రమమున దినదినాభివృద్ధి కనఁబడు చున్నది. అయ్యది శుభసూచనయే. మాయుత్తరోత్తర ప్రయత్నములు నిర్విఘ్నముగఁ గొనసాగు గాకయని శ్రీనివాసునిఁ బ్రార్థించుచున్నాను.

తిరుమల తిరుపతి దేవస్థానముల ముద్రణాలయము కా. 200 20—3—54.